www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
04 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 239

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## హైడ్రాకు నిమజ్జన గండం.. ఆపగలరా?

- చెరువుల్లో నిమజ్జనంపై నిబంధనలు
- బేబీ పాండ్స్ వైపు అధికారుల మొగ్గు
- ట్యాంక్‌బండ్ నిమజ్జనంపై పట్టుబట్టిన సమితి
- పర్యావరణం, సంప్రదాయం మధ్య పోరు
- రాజీ కోసం ప్రభుత్వం ప్రయత్నాలు

హైడ్రా ఆంక్షలపై గణేష్ సమితి ఫైర్

02



## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు వర్ధమాన్ వీడ్కోలు

- 22 ఏళ్ల సుదీర్ఘ సేవలకు స్వచ్ఛంద పదవీ విరమణ
- ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ ఫ్లై91లో చేరిన వీర్ చక్ర గ్రహీత
- కమర్షియల్ విమానయాన రంగంలోకి అడుగు
- 2019లో పాక్ ఎఫ్-16ను కూల్చడంతో దేశవ్యాప్తంగా కీర్తి

02



## వాళ్లు కనీసం బాత్రూమ్‌కు కూడా వెళ్లలేరు

- ప్రతి కదలికనూ గమనిస్తున్నాం
- ఇరాన్‌పై పక్కాగా నిరంతర నిఘా పెట్టాం
- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

03

తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ బర్తరఫ్ ఎపిసోడ్ సంచలనం సృష్టిస్తోంది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన సురేఖ పుట్టినరోజు వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ హైకమాండ్ సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ వేదికగా మల్లికార్జున ఖర్గేతో ఆమె జరిపిన రాయబారాలు ఫలించలేదు. మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు ఆమె నిరాకరించడంతో, సీఎస్ ద్వారా లేఖ పంపిన సీఎం రేవంత్ గవర్నర్ ఆమోదంతో సురేఖను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేశారు. తనను బర్తరఫ్ చేయకముందే తన ఆవేదన వ్యక్తంచేస్తూ ఆగస్టు 22న ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి కొండా సురేఖ రాసిన పది పేజీల రహస్య లేఖ బయటకు వచ్చి తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల్లో తన ప్రమేయం లేకుండానే సీఎంవో నేరుగా నిర్ణయాలు తీసుకుంటోందని, తనను ఒక డమ్మీ మంత్రిని చేశారని సురేఖ ఆరోపించారు.

# కొండా సురేఖ పోస్ట్ ఊస్ట్

### కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు

- సీఎం రేవంత్‌పై సురేఖ సంచలన ఆరోపణలు
- సోనియా గాంధీకి పది పేజీల రహస్య లేఖ
- తనను డమ్మీ మంత్రిని చేశారని ఆవేదన
- వరంగల్‌కు నిధుల విషయంలో వివక్ష ఆరోపణలు
- కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత విభేదాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ముప్పై ఒక్క ఏళ్ల రాజకీయ జీవితంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండోసారి మంత్రిగా ప్రజల ఆదరణ పొందానని సురేఖ లేఖలో గుర్తు చేశారు. బీసీల్లో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన తాను, మున్నూరు కాపు వర్గానికి చెందిన తన భర్త కొండా మురళీధర్ రావు పార్టీ కష్టకాలంలో అండగా నిలబడ్డామని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి తనను ఉద్దేశపూర్వకంగానే అణగదొక్కుతున్నారని ఆరోపించారు. మంత్రిగా తనకున్న అధికారాలను లాగేసుకున్నారని, దేవాదాయ శాఖలో యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు లాంటి కీలక విషయాల్లో తనకు కనీస సమాచారం ఇవ్వలేదని వాపోయారు. సమ్మక్క సారలమ్మ గుడి శాశ్వత అభివృద్ధికి దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేస్తే, ఆ నిధులను ఒక్కరోజులోనే ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు చెప్పకుండా తన మాజీ ఓఎస్డీ సుమంత్‌ను పదవి నుంచి తొలగించారని, నాన్‌బెయిలబుల్ కేసులో ఇరికించేందుకు పోలీసులను పంపారని సురేఖ తీవ్రమైన ఫిర్యాదు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రిగా ఉన్న తనకు

మిగతా 2లో..

## నన్ను బెదిరిస్తే భయపడను

### బెదిరింపులకు భయపడనన్న సీఎం రేవంత్‌రెడ్డి



- స్నేహంతోనే తనను గెలవగలరని వ్యాఖ్య
- పాతబస్తీ కాదు.. ఒరిజినల్ సిటీ అంటూ వ్యాఖ్య
- రూ.500 కోట్లతో మీరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి
- పాతబస్తీ మెట్రో పూర్తి చేస్తామని హామీ
- రేవంత్‌కు అసదుద్దీన్ ఒవైసీ మద్దతు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనను ఎవరూ బెదిరించవద్దని, బెదిరిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ పాతబస్తీలో నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ తన రాజకీయ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. బెదిరింపులకు తాను లొంగనని, స్నేహంతోనే తనను గెలవగలరని చెప్పారు. తాను ఎవరికీ గులామ్‌ను కాదని, దోస్తీకి మాత్రమే గులామ్‌నని వ్యాఖ్యానించారు. ఎన్నికలు వస్తుంటాయని, పోతుంటాయని, గెలుపోటములు రాజకీయాల్లో సహజమని తెలిపారు. ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని భరోసా ఇచ్చారు. నగరంలో శాంతి, సామరస్యం, అభివృద్ధి కలిసి సాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసమే

మిగతా 2లో..

## మంత్రిగా రాజగోపాల్ రెడ్డి..?

- లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు
- ముగ్గురికి మంత్రి పదవులు ఖరారు?
- మహేశ్ గౌడ్, గడ్డం ప్రసాద్, రాజగోపాల్ రెడ్డి
- అసెంబ్లీ సమావేశాలకు ముందే కొత్త మంత్రులు
- మరో బెర్త్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ

సెప్టెంబర్ 6న కేబినెట్ విస్తరణ?



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న కొత్త మంత్రులను కేబినెట్‌లోకి తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. లోక్‌భవన్ వేదికగా ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం పలువురు ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తాజాగా ముగ్గురు నేతల పేర్లు దాదాపు

మిగతా 2లో..

## దమ్ముంటే కొడిపల్లికి రా..!

హరీశ్ రావు కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు

- ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని ఆరోపణ
- రుణమాఫీపై సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్
- రైతుబీమా, రైతుబంధుపై ప్రభుత్వాన్ని నిలదీత
- సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్న హరీశ్ రావు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మెదక్ జిల్లా కౌడిపల్లిలో జరిగిన నిరసన సభలో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు ముగిసింది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఆ పార్టీ నాయకులు మోసం చేశారు. ఎన్నికల సమయంలో బాండ్ పేపర్లు రాసిచ్చి ప్రజలను నమ్మించారు. ఆచరణలో మాత్రం అన్ని హామీలను పూర్తిగా అటకెక్కించారు. రూ.4000 పెన్షన్ ఇస్తామని చెప్పి మాట తప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2500 ఇస్తామన్న హామీని విస్మరించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను నిలిపివేశారు. రైతుబంధు పథకాన్ని సరిగ్గా అమలు చేయడం లేదు. రైతుబీమా పథకాన్ని కూడా పూర్తిగా బంద్ చేశారు. ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతుబీమా నిలిచిపోయింది. దీని ద్వారా రైతన్నలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. కాంగ్రెస్ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది. రుణమాఫీ పేరుతో ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని హరీశ్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. పోలీసులు లేకుండా

మిగతా 3లో..

## రైతుల పోరాటాన్ని ఉధృతం చేస్తాం

- సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదలపై కేటీఆర్ డెడ్‌లైన్
- సెప్టెంబర్ 14లోపు షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్
- నీరు ఇవ్వకపోతే రైతులతో పాదయాత్రకు సిద్ధం
- కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర
- 2003లో కేసీఆర్ పోరాటాన్ని గుర్తుచేసిన కేటీఆర్
- కాంగ్రెస్ సర్కార్‌పై రైతు వ్యతిరేక విధానాల ఆరోపణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేయకపోతే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. మిర్యాలగూడలో నిర్వహించిన రైతు ధర్నా వేదికగా ఆయన ఈ హెచ్చరిక చేశారు. సాగర్‌లో 180 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ ఎడమ కాలువ కింద సాగు చేస్తున్న రైతులకు చుక్క నీరు కూడా ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల పరిస్థితిని ప్రభుత్వం వెంటనే గుర్తించి, కాలువకు నీరు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే గ్రామగ్రామాన ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. నీటి సమస్యను తేలికగా తీసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

మిగతా 3లో..



## రేవంత్‌రెడ్డిని శపిస్తున్నాను

- సురేఖ మంత్రివర్గం నుంచి బర్తరఫ్
- రేవంత్‌పై సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు
- పరకాల నుంచి పోటీకి సీఎంకు సవాల్
- తల్లికి అండగా ఉంటానన్న సుస్మిత
- సురేఖ వ్యాఖ్యల నుంచి దూరం
- కాంగ్రెస్‌లో క్రమశిక్షణపై చర్చ

03

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం మరింత వేడెక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తర్వాత సురేఖ కుటుంబం నుంచి వస్తున్న స్పందనలు కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరతీశాయి. సురేఖ కుమార్తె కొండా సుస్మిత తన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమైనవని స్పష్టం చేశారు.

## నాకు పదవులపై సోకు లేదు

- చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి కోల్పోయారు
- పదవి పోయినా ప్రశాంతంగా పొలాల్లోకి వెళ్లారు
- పదవులపై వ్యామోహం లేదని స్పష్టం చేశారు
- రేవంత్‌ను కలిసే ఆలోచన లేదని తేల్చారు
- భవిష్యత్ నిర్ణయంపై అనుచరులతో చర్చలు



02

# మంత్రిగా రాజగోపాల్ రెడ్డి..?



**మొదటి పేజీ తరువాయి**

ఖరారైనట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు తెలుస్తోంది. దీంతో తెలంగాణ కేబినెట్‌లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం కనిపిస్తోంది. ముగ్గురికి కీలక శాఖలు కేటాయించే అవకాశంపై కూడా పార్టీలో చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఆశావహుల్లో ఉత్కంఠ పెరిగింది. అధికారిక ప్రకటన కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలోనే కేబినెట్ విస్తరణను ముందుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్తగా మంత్రులుగా బాధ్యతలు స్వీకరించే ముగ్గురు నేతలు అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ తరఫున కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు ఇవ్వడంతో పాటు ఆయా శాఖలపై స్పష్టమైన వివరణలు అందించేందుకు వీరిని సిద్ధం చేయనున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా మంత్రి పదవుల కోసం హస్తిన స్థాయిలో ప్రయత్నాలు సాగించిన నేతలకు ఈ పరిణామం కీలకంగా మారింది. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ముగ్గురి ఎంపిక జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకరు ఎస్సీ వర్గానికి, మరొకరు బీసీ వర్గానికి, ఇంకొకరు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదంతోనే నిర్ణయం ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామం పార్టీలో కొత్త ఉత్సాహం నింపింది. మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కడం ద్వారా బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకత్వం సంకేతం ఇవ్వనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడిగా పార్టీ వ్యవహారాలను ముందుకు తీసుకెళ్లిన ఆయనకు కేబినెట్‌లో స్థానం కల్పించడం ద్వారా సంస్థాగత బాధ్యతలకు ప్రభుత్వ బాధ్యతలను జోడించే అవకాశం ఉంది. మరోవైపు గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం పెరగనుంది. స్పీకర్ పదవిలో ఉన్న ఆయనకు కేబినెట్‌లో కీలక బాధ్యత అప్పగించే అంశం చర్చనీయంగా మారింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎంపికకు కూడా రాజకీయ ప్రాధాన్యం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ బలాన్ని మరింత పెంచే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముగ్గురి చేరికతో కేబినెట్ సమతుల్యత మారనుంది. ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించే అవకాశం కనిపిస్తోంది. శాఖల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుపుకుంటే తెలంగాణ మంత్రివర్గంలో మొత్తం 15 మంది ఉన్నారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన తరువాత మంత్రుల సంఖ్య 14కు తగ్గింది. ఇప్పుడు మహేశ్ కుమార్ గౌడ్, గడ్డం ప్రసాద్ కుమార్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తే కేబినెట్‌లో సభ్యుల సంఖ్య మళ్లీ 17కు చేరుతుంది. రాజ్యాంగ పరిమితుల ప్రకారం రాష్ట్రంలో ముఖ్యమంత్రితో కలిపి గరిష్ఠంగా 18 మంది మంత్రులు ఉండేందుకు అవకాశం ఉంది. దీంతో తాజా విస్తరణ అనంతరం మరో ఒక మంత్రి పదవి ఖాళీగా మిగలనుంది. ఆ బెర్త్ ఎవరికి దక్కుతుందనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్‌లో మొదలైంది. ప్రాంతీయ సమీకరణాలు, సామాజిక వర్గాలు, రాజకీయ ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుని చివరి బెర్త్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు సమాచారం. దీంతో చివరి బెర్త్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే కీలకం కానుంది. కేబినెట్ విస్తరణ జరిగితే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వ్యూహం మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నుంచి వచ్చే విమర్శలను ఎదుర్కొనేందుకు కొత్త మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా నిర్ణయాలపై సభలో సమర్థవంతమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కొత్త మంత్రులపై ఉంటుంది. సెప్టెంబర్ 6న ప్రమాణస్వీకారం జరిగితే మరుసటి రోజు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లోనే వారు కొత్త హోదాలో కనిపించనున్నారు. అయితే అధికారికంగా తేదీ, పేర్లు, శాఖల కేటాయింపుపై ప్రభుత్వం ప్రకటన చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ శ్రేణుల్లో మాత్రం విస్తరణపై ఉత్కంఠ నెలకొంది. ఆశావహులు తమకు అవకాశం వస్తుందనే నమ్మకంతో అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ముగ్గురి చేరికతో ప్రభుత్వంలో రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది. చివరి బెర్త్ ఎవరికి దక్కుతుందో చూడాలి. అధికారిక ప్రకటనతో దీనిపై స్పష్టత రానుంది.

# కొండా సురేఖకు పోస్ట్ డోస్ట్

**మొదటి పేజీ తరువాయి**

సమాచారం లేకుండానే దేవాదాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా కుటుంబాన్ని రాజకీయంగా ఒంటరిని చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. సంగారెడ్డి నుంచి జగ్గారెడ్డి ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది హైకమాండ్ నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం రేవంత్, పరకాలలో మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓపెన్‌గా స్టేట్మెంట్స్ ఇస్తున్నారని ప్రశ్నించారు. పార్టీలో ఉన్న ఈ ద్వంద్వ వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. పక్క నియోజకవర్గాలకు ఫండ్స్ ఇస్తూ తన నియోజకవర్గంలోని స్మార్ట్ సిటీ మోడల్ బస్ స్టాండ్, బొంది వాగు విస్తరణ ప్రాజెక్టులకు మాత్రం కావాలనే నిధులు ఆపుతున్నారని సురేఖ తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. పరకాల నియోజకవర్గం భవిష్యత్తు గురించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల వల్లే మానసిక వేదనకు గురైన తన కూతురు సుస్మిత పటేల్ కొన్ని కామెంట్స్ చేసిందని సురేఖ వివరణ ఇచ్చారు. మేజర్ అయిన ఓ కుటుంబ సభ్యురాలు చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలకు తల్లిని అయినంత మాత్రాన మంత్రికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని లేఖలో వాపోయారు. కేవలం బీసీ మహిళను అయినందుకే తనపై ఈ వివక్ష చూపుతున్నారని, కొందరు లీడర్లు తనపై పరుష పదజాలంతో మూకుమ్మడి దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న తన లాంటి



సీనియర్ నేతకు జరుగుతున్న అన్యాయంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని సోనియా గాంధీని కొండా సురేఖ అభ్యర్థించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మంత్రివర్గం నుంచి తొలగింపునకు గురికావడంతో కొండా దంపతులు భవిష్యత్తు కార్యాచరణపై పూర్తిస్థాయి దృష్టి పెట్టారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొందరు తెరవెనుక సయోధ్య కుదిర్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి వర్గం మాత్రం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. సురేఖ అనుచరులు అభిమానులు వరంగల్ ప్రాంతంలో పెద్దఎత్తున నిరసనలకు దిగుతున్నారు. అధికార పార్టీలో నెలకొన్న ఈ అంతర్గత కలహాలు ప్రభుత్వ ప్రతిష్టను కొంతమేర దెబ్బతీసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హైకమాండ్ సకాలంలో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దకపోతే రానున్న రోజుల్లో మరిన్ని ఊహించని పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కొండా సురేఖ లేఖలోని సంచలన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. రాబోయే కాలంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఈ పరిణామాలు ఎలాంటి పెద్ద మార్పులకు శ్రీకారం చుడతాయో వేచి చూడాలి.

# ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు వర్ధమాన్ వీడ్కోలు



**న్యూఢిల్లీ:** వీరోచితంగా పాకిస్థాన్ యుద్ధ విమానాన్ని కూల్చివేసిన మాజీ గ్రూప్ కెప్టెన్, వీర్ చక్ర అవార్డ్ గ్రహీత అభినందన్ వర్ధమాన్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు వీడ్కోలు పలికారు. 22 ఏళ్ల పాటు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో విశేష సేవలందించిన ఆయన స్వచ్ఛంధ పదవీ విరమణ (ప్రీమ్యాచ్యూర్ రిటైర్మెంట్) చేశారు. రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) పొందిన అనంతరం ఆయన మార్చి 31న ఎయిర్‌ఫోర్స్ నుంచి స్వచ్ఛధంగా తప్పుకున్నారు. అయితే, ఈ అంశంపై అభినందన్ వర్ధమాన్ మాత్రం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. కాగా, కమర్షియల్ విమానయాన రంగంలోకి వర్ధమాన్ అడుగుపెట్టారు. ప్రైవేట్ విమానయాన సంస్థ 'ఫ్లై91'లో కమర్షియల్ పైలట్‌గా కొత్త జర్నీని ప్రారంభించారు. గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఈ ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌లో ఆగస్టు 2026లోనే చేరారు. అయితే, ఉద్యోగుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేమని, ఇది సంస్థాగతంగా ప్రైవేట్ విషయమని ఫ్లై91 ప్రతినిధి చెప్పారు. ఫ్లై ఎయిర్‌లైన్స్ మార్చి 2024లో తన వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ సంస్థ వద్ద ప్రస్తుతం 6 ఏటీఆర్72600 మోడల్ విమానాలు ఉన్నాయి. గోవా, హైదరాబాద్ కేంద్రాలుగా ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

**పాక్ ఎఫ్-16ను కూల్చివేసిన వర్ధమాన్**

2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. ఈ ఘటనకు ప్రతీకారంగా ఫిబ్రవరి 26న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో ఉన్న ఉగ్రవాద శిక్షణ శిబిరాలపై సర్జికల్ స్ట్రైక్స్ జరిపి ధ్వంసం చేసింది. మరుసటి రోజు పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ భారత్ సరిహద్దుల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించింది. ఆ సమయంలో శ్రీనగర్‌లోని 51వ స్క్వాడ్రన్‌లో అప్పటి వింగ్ కమాండర్‌గా ఉన్న అభినందన్ వర్ధమాన్, పాతతరం మిగ్21 బైసన్ ఫైటర్ జెట్‌ను పాక్ యుద్ధ విమానాలను తిప్పికొట్టారు. శక్తివంతమైన పాకిస్థాన్ ఫోర్త్ జనరేషన్ ఎఫ్16 ఫైటర్ జెట్‌ను తన విమానంలోని మిసైల్‌ను ప్రయోగించి వర్ధమాన్ కూల్చివేసి చరిత్ర సృష్టించారు. అయితే, కూల్చివేత క్రమంలో ప్రత్యర్థి క్షిపణి వచ్చి మిగ్21 విమానానికి తగలడంతో అభినందన్ విమానం దెబ్బతిన్నది. ఆయన పారాచూట్ ద్వారా పాకిస్థాన్ ఆక్రమిత భూభాగంలోకి పారాచ్యూట్ సహాయంతో దిగారు. దీంతో, పాక్ సైన్యానికి బందీగా చిక్కారు. తీవ్ర గాయాలైనప్పటికీ పాక్ మిలిటరీ విచారణలో ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించారు. ఎంత ప్రశ్నించినా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన చిన్న సమాచారాన్ని కూడా చెప్పలేదు. భారత్ దౌత్య, అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా 2019 మార్చి 1న పాకిస్తాన్ ఆయనను సురక్షితంగా భారత్‌కు అప్పగించింది. ఆ తర్వాత అభినంధన్ వర్ధమాన్‌కు ఎయిర్‌ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్‌గా (కర్నల్ హోదా) పదోన్నతి లభించింది.

## హైడ్రాకు నిమజ్జన గండం..
# ఆపగలరా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో వినాయక చవితి నిమజ్జనాలపై హైడ్రా, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మధ్య వివాదం ముదురుతోంది. చెరువులు, జలాశయాల పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన హైడ్రా, పర్యావరణ రక్షణ కోసం కొన్ని కీలక నిబంధనలు అమలు చేస్తోంది. పునరుద్ధరించిన చెరువుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు నిమజ్జనం అనుమతించలేమని అధికారులు చెబుతున్నారు. రసాయన రంగులు నీటిలో కలవడం వల్ల కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. ప్రధాన జలాశయాలకు బదులుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బేబీ పాండ్స్‌ను ఉపయోగించాలని సూచిస్తున్నారు. అయితే ఈ నిర్ణయం భక్తుల సంప్రదాయాలపై ప్రభావం చూపుతుందని ఉత్సవ సమితి నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ బండ్ సహా ప్రముఖ ప్రాంతాల్లో గతంలో జరిగిన విధంగానే నిమజ్జనం జరగాలని కోరుతున్నారు. దీంతో అధికారుల ఆంక్షలు, భక్తుల సెంటిమెంట్ మధ్య ఉద్రిక్తత పెరుగుతోంది. ఉత్సవాలు దగ్గరపడుతున్న కొద్దీ ఈ అంశం రాజకీయ చర్చగా మారుతోంది. నగర ప్రజల్లో కూడా దీనిపై ఆసక్తి పెరుగుతోంది. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని నగరవాసులు కోరుతున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యవేక్షణలో చెరువుల సంరక్షణ చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలు జలాశయాల పునరుద్ధరణకు భారీగా నిధులు ఖర్చు చేసిన అధికారులు, వాటి పరిస్థితి మళ్లీ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విగ్రహాల తయారీలో ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో త్వరగా కరగకపోవడం, రసాయన రంగులు కలవడం వల్ల జలచరాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అందుకే ప్రధాన చెరువుల వద్ద కఠిన నిఘా పెట్టాలని నిర్ణయించారు. నిమజ్జన ప్రాంతాల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు పెంచుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, నీటి నాణ్యత, పర్యావరణ సమతుల్యతను కాపాడటం తమ బాధ్యతగా అధికారులు పేర్కొంటున్నారు. సంప్రదాయాలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు. సమస్యను ఘర్షణగా కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ చర్యలతో చెరువులపై ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు నిరంతరం. నగరంలో పర్యావరణ భద్రతకు ఇది కీలకంగా మారింది. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మాత్రం హైడ్రా నిర్ణయాలను అంగీకరించడం లేదు. తరతరాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాలను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదని నేతలు స్పష్టం చేస్తున్నారు. పెద్ద విగ్రహాలను చిన్న బేబీ పాండ్స్‌లో ఎలా నిమజ్జనం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ట్యాంక్ బండ్ సహా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించి నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ అవసరమే అయినా, భక్తుల విశ్వాసాలను పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని వాదిస్తున్నారు. ప్రజా ప్రతినిధులను కలిసి తమ అభ్యంతరాలను వివరిస్తున్నారు. అధికారులు, ఉత్సవ కమిటీ మధ్య చర్చలు జరిగితే పరిష్కారం దొరకవచ్చని కొందరు భావిస్తున్నారు. అయితే తమ సంప్రదాయ హక్కుల విషయంలో వెనక్కి తగ్గబోమని సమితి నేతలు చెబుతున్నారు. దీంతో వివాదం మరింత వేడెక్కుతోంది. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంప్రదాయాన్ని గౌరవించేలా ప్రత్యామ్నాయ మార్గం చూపాలని వారు కోరుతున్నారు స్పష్టంగా. భక్తుల విశ్వాసానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రస్తుతం రెండు కీలక సవాళ్లు కనిపిస్తున్నాయి. పర్యావరణ నిబంధనలు, న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయడం ఒక బాధ్యత అయితే, ప్రజల మతపరమైన భావాలను గౌరవించడం మరో ముఖ్యమైన అంశంగా మారింది. అందుకే అధికారులు ఉత్సవ సమితులతో సమావేశాలు నిర్వహిస్తూ మధ్యస్థ పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. నిమజ్జనానికి అనుకూలమైన ప్రాంతాలు, విగ్రహాల పరిమాణం, పర్యావరణహిత పదార్థాల వినియోగం వంటి అంశాలపై చర్చలు సాగుతున్నాయి. పెద్ద విగ్రహాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే సమస్య కొంత తగ్గే అవకాశం ఉంది. మరోవైపు నిబంధనలను పూర్తిగా సడలిస్తే చెరువుల సంరక్షణ లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే ముందస్తు ప్రణాళిక, సమన్వయం అవసరమవుతోంది. పోలీసులు కూడా అన్ని వర్గాలతో మాట్లాడి శాంతిభద్రతలకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపడుతున్నారు. చివరి నిర్ణయం ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని పలువురు కోరుతున్నారు. ప్రతి నిర్ణయంలో పారదర్శకత పాటిస్తే అపోహలు తగ్గే అవకాశం ఉంది త్వరగా. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం ఇప్పుడు అత్యవసరం. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా ముగియాలంటే హైడ్రా, ప్రభుత్వం, ఉత్సవ సమితులు, భక్తులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పర్యావరణాన్ని కాపాడటం భవిష్యత్ తరాలకు అవసరమైన బాధ్యత. అదే సమయంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలకు గౌరవం ఇవ్వడం కూడా ముఖ్యం. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత సాధిస్తే వివాదానికి సులభమైన పరిష్కారం దొరకవచ్చు. పర్యావరణహిత విగ్రహాల వినియోగం, ప్రత్యేక నిమజ్జన కేంద్రాల విస్తరణ, పెద్ద విగ్రహాలకు తగిన సదుపాయాలు వంటి మార్గాలను పరిశీలించవచ్చు. అధికారులు నిర్ణయాలు తీసుకునే ముందు ఉత్సవ నిర్వాహకులతో స్పష్టమైన చర్చలు జరపడం ఉపయోగకరం. భక్తులు కూడా నిబంధనలను అర్థం చేసుకుని సహకరిస్తే పరిస్థితి అదుపులో ఉంటుంది. నగరంలో శాంతి, భక్తి, పర్యావరణ పరిరక్షణ కలిసి సాగడం అందరి లక్ష్యంగా ఉండాలి. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపుతుందో ఆసక్తిగా మారింది.



# నాకు పదవులపై సోకు లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించాయి. క్రమశిక్షణ ఉల్లంఘన ఆరోపణల నేపథ్యంలో సీనియర్ నేత జి. చిన్నారెడ్డిపై పార్టీ హైకమాండ్ అనూహ్యమైన వేటు వేసింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి ఆయనను తప్పిస్తూ అధిష్టానం తీసుకున్న నిర్ణయం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. ఈ అనూహ్య పరిణామంపై ఆయన వెంటనే స్పందించారు. పదవి కోల్పోయిన కొద్ది గంటల్లోనే ఆయన తన సొంత ఊర్లోని పంటపొలాల్లో ప్రత్యక్షమయ్యారు. వ్యవసాయ పనులను పరిశీలిస్తూ ప్రశాంతంగా సాధారణ జీవితం గడుపుతున్నట్లు ఆయన చూపించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన తనదైన శైలిలో సంయమనంతో సమాధానాలు ఇచ్చారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని ఆయన ఈ చర్య ద్వారా నిరూపించే ప్రయత్నం చేశారు. తనకు ఏ పదవి మీద ఎలాంటి వ్యక్తిగత వ్యామోహం లేదని స్పష్టం చేశారు. కేవలం పదవి పోయినంత మాత్రాన సమాజంలో తనకున్న గౌరవం ఎన్నటికీ తగ్గదని తేల్చిచెప్పారు. ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన నాటి నుంచి తాను ఈ సంస్థలోనే నిబద్ధతతో కొనసాగుతున్నానని ఆయన గర్వంగా గుర్తు చేశారు. దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో శ్రమించానని తెలిపారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ప్రజాక్షేత్రంలో ఈ స్థాయికి చేరుకున్నట్లు ఆయన వివరించారు. పార్టీ సిద్ధాంతాల కోసం తాను ఎప్పుడూ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేవలం పదవుల కోసమే తాను ఎన్నడూ రాజకీయం చేయలేదని తేల్చిచెప్పారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో అనేక ఉన్నత పదవులు అనుభవించినప్పటికీ, సాధారణ కార్యకర్తగా ఉండటమే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. ప్రస్తుత భవిష్యత్తు కార్యాచరణపై తాను ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యేక ఆలోచన చేయలేదని ఆయన చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలనే ఉద్దేశం తనకు లేదని కుండబద్దలు కొట్టారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని తాను గౌరవిస్తున్నానని స్పష్టం చేశారు. అయితే భవిష్యత్తులో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదని తెలిపారు. మారుతున్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. అనుచరులు అలాగే శ్రేయోభిలాషులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే తదుపరి అడుగులు వేస్తానని స్పష్టం చేశారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా పూర్తి సంయమనం పాటిస్తానని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో తన వంతు పాత్ర తాను సమర్థంగా పోషించానని తెలిపారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నాయకత్వానికి ఎల్లప్పుడూ అండగా నిలిచానని గుర్తు చేసుకున్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయం తనకు కొంత ఆశ్చర్యం కలిగించినా, దానిని శిరసావహిస్తానని చెప్పారు. తనపై వేటు పడినంత మాత్రాన పార్టీ సిద్ధాంతాలను విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని మరోసారి ఉద్ఘాటించారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన తనకు వ్యవసాయం అంటే ప్రాణమని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్ల నుంచి కాసేపు దూరంగా ప్రశాంత వాతావరణంలో గడపడానికి పంటపొలాలకు వచ్చానని తెలిపారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని ప్రజలందరికీ తెలుసన్నారు. ఏనాడు కూడా స్వార్థం కోసం తాను పనిచేయలేదని తెలిపారు. భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహం గురించి త్వరలోనే స్పష్టత ఇస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచిన కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ మొత్తం ఉదంతంపై పార్టీ శ్రేణులలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ నాయకుడి తొలగింపు పార్టీ అంతర్గత సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు పాటుపడిన నేతను పక్కన పెట్టడం పట్ల అనుచరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో చిన్నారెడ్డి ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకుంటారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రత్యమ్నాయ రాజకీయ మార్గాలను అన్వేషిస్తారా లేక కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా అనేది కాలమే నిర్ణయించాలి. ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ క్లిష్ట పరిస్థితిని చిన్నారెడ్డి ఎంతో పరిపక్వతతో ఎదుర్కొంటున్నట్లు స్పష్టమవుతోంది. పదవులు శాశ్వతం కాదనే నిజాన్ని ఆచరణలో చూపిస్తూ ఆయన రైతు వృత్తిపై మక్కువ చాటుకున్నారు. ప్రత్యర్థులకు సైతం విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ఆయన వ్యవహరించిన తీరు ఆకట్టుకుంటోంది. భవిష్యత్తు కార్యాచరణపై తొందరపడి ఎలాంటి ప్రకటనలు చేయకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అనుచరుల అభిప్రాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని ఆయన నిశ్చయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ పరిణామాన్ని ఏ విధంగా సరిదిద్దుకుంటుందనేది వేచి చూడాలి. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో మరింత జోరందుకునే సూచనలున్నాయి. ఏది ఏమైనప్పటికీ చిన్నారెడ్డి తీసుకున్న ఈ వ్యవసాయ బాట నిర్ణయం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశమైంది. ఆయన రాజకీయ భవిష్యత్తు ఏ దిశగా పయనిస్తుందో వేచి చూడాల్సిందే. ప్రజల మన్ననలు పొందిన నాయకుడు ఎక్కడ ఉన్నా తనదైన ముద్ర వేయగలడని ఆయన నిరూపించారు.



# నన్ను బెదిరిస్తే భయపడను

**మొదటి పేజీ తరువాయి**

తనకు ప్రధాన బలమని అన్నారు. ఇదే తన రాజకీయ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పాతబస్తీని ఓల్డ్ సిటీగా పిలవడం సరికాదని, ఇది ఒరిజినల్ సిటీ అని రేవంత్ అన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి వీధి, సమస్య తనకు తెలుసని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన నిధులు విడుదల చేసి పనులను వేగంగా పూర్తిచేసిందని చెప్పారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని తెలిపారు. ఆ వంతెన పూర్తయితే పర్యాటక రంగానికి, రవాణాకు పెద్ద ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తయిందని గుర్తుచేశారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారుల విస్తరణతో ప్రయాణ సమయం తగ్గుతుందని, వ్యాపార కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని చెప్పారు. స్థానిక అవసరాలు దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. నిర్ణయాలు స్థానిక ప్రజలకు ఉపయోగపడతాయని చెప్పారు. పాతబస్తీ మెట్రో ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని రేవంత్ స్పష్టం చేశారు. నాలాలపై ఉన్న ఆక్రమణలను తొలగించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. అభివృద్ధి పనుల సమయంలో పేదల ఇళ్లు తొలగించాల్సి వస్తే వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పాతబస్తీ అభివృద్ధిని కేవలం రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపడతామని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని సీఎం చెప్పారు. నగర సుందరీకరణపైనా ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సభలో అసదుద్దీన్ ఒవైసీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రేవంత్ పనితీరును చూసి కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి తనదైన పంథాలో పరిపాలన కొనసాగించాలని సూచించారు. పాతబస్తీ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తయితే నగర ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని చెప్పారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే హైదరాబాద్‌కు మరింత వేగంగా మౌలిక సదుపాయాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ వేదికపై రేవంత్, ఒవైసీ మధ్య కనిపించిన సానుకూల వాతావరణం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. నగరాభివృద్ధి కోసం సహకారం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి రాజకీయ సహకారం అవసరమని ఒవైసీ అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మొత్తంగా పాతబస్తీ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ సభ రాజకీయ సందేశాలతో పాటు అభివృద్ధి హామీలకు వేదికగా మారింది. ఒకవైపు బెదిరింపులకు తాను భయపడనని రేవంత్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వం పనితీరుపై సానుకూలంగా స్పందించడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఫ్లైఓవర్లు, కేబుల్ బ్రిడ్జి, మెట్రో, నాలాల ప్రక్షాళన వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడం ద్వారా పాతబస్తీ రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.



## వాళ్లు కనీసం బాత్రూమ్‌కు కూడా వెళ్లలేరు

**వాషింగ్టన్:** అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం మరింత వేడెక్కిన నేపథ్యంలో ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై అమెరికా నిరంతర, అత్యంత ఖచ్చితమైన నిఘా పెట్టిందని వ్యాఖ్యానించారు. ''వాళ్లు కనీసం బాత్రూమ్‌కు కూడా వెళ్లలేరు. ప్రతి కదలికనూ మేము గమనిస్తున్నాం'' అని గురువారం ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ పునర్నిర్మిస్తున్న మిసైల్, రాడార్ వ్యవస్థలను అమెరికా ధ్వంసం చేసిందని, అవసరమైతే ఏ క్షణమైనా మళ్లీ దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. ఇరాన్ మూసివేసిన వ్యూహాత్మక చమురు రవాణా మార్గం 'హోర్ముజ్ జలసంధి'పై గత ఆరు నెలలుగా, ప్రస్తుతం కూడా తమకే పూర్తి నియంత్రణ ఉందని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఆ జలసంధిలో మైన్లు వేయడానికి ఇరాన్ సరికొత్త రాకెట్ వ్యవస్థను, రాడార్లను తయారు చేస్తోందని, అది పూర్తయ్యే దశలోనే తమ వైమానిక దాడుల ద్వారా పూర్తిగా ధ్వంసం చేశామని ట్రంప్ వెల్లడించారు. ప్రతిరోజూ మిలియన్ల కొద్దీ బారెళ్ల చమురు మోసుకెళ్తున్న నౌకలను అమెరికా రక్షణతో సురక్షితంగా తీసుకెళ్తున్నామని, ఇరాన్ గురిపెడుతున్న ఒకటి రెండు డ్రోన్లను సులభంగా కూల్చివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జులై నెల తర్వాత ఇరాన్‌పై అమెరికా అతిపెద్ద సాయుధ దాడులు జరిపింది. దక్షిణ ఇరాన్ తీర ప్రాంతాలు, హోర్ముజ్ జలసంధి సమీప లక్ష్యాలపై వైమానిక దాడులు జరిపింది. ఈ క్షిపణి దాడుల్లో కనీసం 18 మంది ప్రాణాలు కోల్పోగా, 108 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

# రైతుల పోరాటాన్ని ఉధృతం చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

ఇది రైతులకు కీలకమైన జీవనాధార సమస్యగా మారింది. ఎడమ కాలువ పరిధిలో సాగు చేసే రైతులకు నీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ పంపిణీ విషయంలో ప్రభుత్వం స్పష్టత చూపడం లేదని విమర్శించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. సెప్టెంబర్ 14లోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని గడువు విధించారు. ఆ తేదీలోగా నిర్ణయం రాకపోతే రైతులను సమీకరించి పెద్ద ఉద్యమం చేపడతామని చెప్పారు. మిర్యాలగూడ ధర్నా ద్వారా రైతుల సమస్యను రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. కాలువ నీటి కోసం ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కుటుంబాలకు తక్షణ పరిష్కారం అవసరమని తెలిపారు. సాగు సమయం దాటిపోకముందే నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. నీటి పంపిణీలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇది జరగాలి. కేటీఆర్ తన పాదయాత్ర ప్రకటనకు తెలంగాణ ఉద్యమ కాలంలోని కేసీఆర్ పోరాటాన్ని స్ఫూర్తిగా ప్రస్తావించారు. 2003లో నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద రైతులు ఎదుర్కొన్న సమస్యలపై కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపట్టారని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించారని తెలిపారు. అదే తరహాలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడి తీసుకురా



వాలని కేటీఆర్ నిర్ణయించారు. రైతుల కోసం జరిగిన పాత పోరాటాల చరిత్రను గుర్తుచేస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో మరోసారి ఉద్యమం అవసరమని చెప్పారు. సాగునీటి సమస్య రాజకీయ అంశం కాదని, వేలాది కుటుంబాల జీవనాధారానికి సంబంధించిన కీలక సమస్య అని వివరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ పోరాటం ద్వారా కాలువ నీటి అంశంపై ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల ఐక్యతే ఉద్యమానికి బలమని చెప్పారు. సెప్టెంబర్ 14 గడువు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఆలోపు నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ అన్నారు. ఈ యాత్రలో రైతుల సమస్యలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఆయన భావిస్తున్నారు. రైతు ధర్నా వేదికగా చేసిన ప్రకటనతో బీఆర్ఎస్ ఈ అంశాన్ని రాజకీయ పోరాటంగా మలిచే సంకేతాలు కనిపిస్తున్నాయి. నీటి విడుదల ఆలస్యం అయితే పంటలపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందా, లేక కేటీఆర్ ప్రకటించిన పాదయాత్ర ప్రారంభమవుతుందా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రైతుల స్పందన నేపథ్యంలో ఈ అంశంపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన కీలక పరిస్థితి ఏర్పడింది. సాగునీటి హామీ అమలుపై రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుల నుంచి వస్తున్న ఒత్తిడి రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. సాగర్ నీటి సమస్యపై చర్చలు వేగం పుంజుకుంటున్నాయి. సాగర్ ఎడమ కాలువ నీటి విడుదలపై కేటీఆర్ చేసిన ప్రకటనతో రైతు సమస్య మరోసారి రాజకీయ చర్చకు వచ్చింది. ప్రభుత్వం వద్ద తగినంత నీరు ఉన్నప్పుడు పంపిణీ ఎందుకు జరగడం లేదనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. రైతులకు అవసరమైన నీటిని అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 14లోపు షెడ్యూల్ ప్రకటిస్తే సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు. లేకపోతే పాదయాత్ర ద్వారా రైతులను ఏకం చేసి ప్రభుత్వ నిర్ణయంపై ప్రజా ఒత్తిడి తీసుకువస్తానని చెప్పారు. కోదాడ నుంచి హాలియా వరకు జరిగే యాత్రకు భారీగా రైతులు తరలివస్తారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. సాగునీటి అంశం చుట్టూ గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఈ ఉద్యమం ప్రతిబింబించే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించే తీరుపైనే తదుపరి రాజకీయ పరిణామాలు ఆధారపడనున్నాయి. రైతుల డిమాండ్ నెరవేరితే ఉద్రిక్తత తగ్గే అవకాశం ఉంది. లేకుంటే ఉద్యమం వేగం పుంజుకునే పరిస్థితి కనిపిస్తోంది.

## బెల్టు షాపులకు కళ్లెం వేయాలి

**మజీద్‌పూర్ గ్రామపంచాయతీ తీర్మానం.. ఎస్ఐ సైదులుకు ప్రతుల అందజేత**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మజీద్‌పూర్ గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను నియంత్రించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామసభ కీలక నిర్ణయం తీసుకున్నాయి. గ్రామంలో కొనసాగుతున్న బెల్టు షాపులపై నిఘా పెంచి, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామసభ తీర్మానం చేశాయి. ఈ మేరకు తీర్మాన ప్రతిని అబ్దుల్లాపూర్ ఎస్ఐ సైదులుకు అందజేశారు.

**మహిళలు, యువతపై ప్రభావం**

గ్రామంలో బెల్టు షాపుల కారణంగా మహిళలు, యువత ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామపంచాయతీ తీర్మానంలో పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయించే కేంద్రాల వల్ల కుటుంబాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని, మద్యపానంతో కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. అనధికారికంగా మద్యం విక్రయించే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**ప్రశాంత వాతావరణమే లక్ష్యం**

ఈ సందర్భంగా మజీద్‌పూర్ సర్పంచ్ మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అక్రమ మద్యం విక్రయాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. బెల్టు షాపుల నియంత్రణలో గ్రామపంచాయతీ, పోలీసు శాఖతో పాటు గ్రామ ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు గ్రామపంచాయతీ తరఫున నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామ ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు.

## వెయ్యి రోజుల ప్రజాపాలనకు ఇబ్రహీంపట్నంలో జైకొట్టు



**కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు.. సీఎం, పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**

**విశాల భారతి, ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్‌మెట్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు.

**నియోజకవర్గవ్యాప్తంగా ఉత్సవ వాతావరణం**

తుర్కయంజాల్ చెరువు కట్ట వద్ద, మున్సిపల్ కార్యాలయం ఎదుట, అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఆదిభట్లలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మంచాల మండల కేంద్రంలోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని సంబురాలు నిర్వహించారు.

**ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధాలు, ఆంక్షలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు.

**మల్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధికి పెద్దపీట**

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు తీసుకురావడంతో పాటు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్, సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ 'ఏ' బ్లాక్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, 'బి' బ్లాక్ అధ్యక్షుడు భాస్కరాచారి, మహిళా నాయకులు కొత్తకుర్మ మంగమ్మ, గుండమోని జయమ్మ, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పార్టీ అధ్యక్షులు లింగం, నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం పట్టణ పార్టీ అధ్యక్షుడు గౌస్‌పాషా, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, ఐలయ్య, రజినీకాంత్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు సికిందర్‌రెడ్డి, అయన్‌పటేల్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నార్సింగి సర్కిల్‌లో మెగా హియరింగ్

**ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**

ఇంటెన్సివ్ రివిజన్ (సార్ ) కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్ పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరుకావాలని అధికారులు సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 5, 6 తేదీల్లో మెగా హియరింగ్ నిర్వహించనున్నట్లు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి నోటీసులు అందజేసినప్పటికీ ఇప్పటివరకు హియరింగ్‌కు హాజరుకాని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత ఓటర్లు తమ నోటీసుల్లో పేర్కొన్న హియరింగ్ కేంద్రాల్లో నిర్ణీత తేదీల్లో హాజరై, అవసరమైన సరైన ధ్రువ పత్రాలను సమర్పించాలని సూచించారు. హియరింగ్ కేంద్రాలుగా మణికొండ కమ్యూనిటీ హాల్, నెక్నాంపూర్ కమ్యూనిటీ హాల్, నార్సింగి సర్కిల్ కార్యాలయం, కోకాపేట వార్డు కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నోటీసులో పేర్కొన్న కేంద్రంలోనే సంబంధిత ఓటర్లు హాజరు కావాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులో హాజరై సరైన ధ్రువపత్రాలు సమర్పించని పక్షంలో నిబంధనల మేరకు సంబంధిత ఓటు తొలగించే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్డబ్ల్యూఏ సంఘాలు ఓటర్లకు అవగాహన కల్పించి, మెగా హియరింగ్‌కు హాజరయ్యేలా సహకరించాలని డిప్యూటీ కమిషనర్ కోరారు.

# రేవంత్‌రెడ్డిని శపిస్తున్నాను

**మొదటిపేజీ తరువాయి**

ఏ పార్టీని లక్ష్యంగా చేసుకుని మాట్లాడలేదని, ఒక వ్యక్తిని ఉద్దేశించి మాత్రమే అభిప్రాయం చెప్పానని తెలిపారు. సీఎన్ఎన్ న్యూస్18తో మాట్లాడిన ఆమె, తన మాటలను పార్టీ రాజకీయాలతో ముడిపెట్టవద్దని కోరారు. తన తల్లికి అన్యాయం జరిగిందని భావిస్తున్నానని, ఆమెను ఆ పరిస్థితిలో చూడటం తీవ్రంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై చర్చ మళ్లీ మొదలైంది. మంత్రివర్గం నుంచి సురేఖ తొలగింపు నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెంచగా, కుటుంబం నుంచి వచ్చిన ఘాటు స్పందనలు వివాదాన్ని మరింత పెద్దదిగా మార్చాయి. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో ఈ పరిణామం మరింత విస్తృతంగా చర్చకు వస్తుంది. ఈ పరిణామం ఎలాంటి మలుపు తీసుకుంటుందో చూడాలి. తన తల్లికి ఎప్పటికీ అండగా ఉంటానని సుస్మిత స్పష్టం చేశారు. ఎవరూ ఆమెను మౌనంగా ఉండేలా చేయలేరని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనను శపిస్తున్నానని అన్నారు. అక్కడితో ఆగకుండా ముఖ్యమంత్రికి నేరుగా రాజకీయ సవాల్ విసిరారు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి రేవంత్ రెడ్డి పోటీ చేయాలని కోరారు. ఈ వ్యాఖ్యలు పరకాల రాజకీయాలపై ఆసక్తిని ఒక్కసారిగా పెంచాయి. ఇప్పటికే స్థానిక కాంగ్రెస్ వ్యవహారాలపై చర్చ సాగుతున్న సమయంలో ఈ సవాల్ రావడంతో వర్గపోరు అంశం మరింత హాట్ టాపిక్‌గా మారింది. సుస్మిత తన మాటలను వ్యక్తిగత అభిప్రాయాలుగా చెప్పినప్పటికీ, ముఖ్యమంత్రిని నేరుగా లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్‌లోని వేర్వేరు వర్గాల మధ్య ఉన్న విభేదాలు ఇప్పుడు బహిరంగ చర్చకు వస్తున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పరకాలలో భవిష్యత్ సమీకరణాలు ఎలా మారతాయన్న ఆసక్తి కూడా పెరుగుతోంది. స్థానిక నేతల తదుపరి స్పందనలు కూడా కీలకంగా మారనున్నాయి. పార్టీ కార్యకర్తల వైఖరి కూడా గమనించాల్సిందే. ఇదిలా



ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కార్యాలయానికి సమాచారం పంపినట్లు వెల్లడైంది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాలు కాంగ్రెస్‌లో నాయకత్వం, క్రమశిక్షణ, అంతర్గత సమన్వయంపై కొత్త ప్రశ్నలు లేవనెత్తాయి. పార్టీ నేతల మధ్య ఇప్పటికే ఉన్న విభేదాలు బహిరంగ వ్యాఖ్యల రూపంలో బయటపడటంతో పరిస్థితి మరింత సున్నితంగా మారింది. సురేఖ బర్తరఫ్‌కు దారితీసిన కారణాలపై రాజకీయ వర్గాల్లో భిన్నమైన చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రి నిర్ణయం తర్వాత పార్టీ వ్యవస్థలో అధికారం ఎలా పనిచేస్తోంది, నేతల మధ్య సమన్వయం ఎలా ఉంది, క్రమశిక్షణను ఎలా అమలు చేస్తారు అనే అంశాలు ప్రధానంగా మారాయి. ఈ నిర్ణయం కాంగ్రెస్‌లో భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. సుస్మితతో పాటు చిన్నారెడ్డి చేసిన ఆరోపణలు కూడా కాంగ్రెస్‌లో తీవ్ర ప్రతిస్పందనకు కారణమయ్యాయి. పార్టీకి చెందిన సీనియర్ నాయకులపై విమర్శలు చేయడం క్రమశిక్షణకు విరుద్ధమని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని కొందరు నాయకులు డిమాండ్ చేశారు. అయితే కొండా సురేఖ తన కుమార్తె వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. సుస్మిత వ్యక్తిగత హోదాలో మాట్లాడారని, ఆ మాటలకు తనను బాధ్యురాలిగా చేయడం సరికాదని తెలిపారు. అయినప్పటికీ కొందరు ఎమ్మెల్యేలు సురేఖపై కూడా చర్యలు తీసుకోవాలని కోరడం వివాదం తీవ్రతను చూపిస్తోంది. దీంతో కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం, నాయకుల మధ్య నమ్మకం, పార్టీ నిర్ణయాలపై చర్చ పెరిగింది. బహిరంగ విమర్శలు కొనసాగితే అధిష్ఠానానికి పరిస్థితిని నియంత్రించడం మరింత కష్టమయ్యే అవకాశం ఉంది. మంత్రివర్గ నిర్ణయం తర్వాత క్రమశిక్షణ చర్యలు కూడా ముందుకు వస్తే రాజకీయ వేడి మరింత పెరగవచ్చు. ప్రస్తుతం కాంగ్రెస్ శ్రేణులు నాయకత్వం తదుపరి నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాయి. మొత్తంగా చూస్తే, కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత సుస్మిత చేసిన ఘాటు వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో వ్యక్తిగత విమర్శలు, పార్టీ క్రమశిక్షణ మధ్య ఉన్న ఉద్రిక్తతను స్పష్టంగా చూపిస్తున్నాయి. తన వ్యాఖ్యలు పార్టీ వ్యతిరేకం కావని సుస్మిత చెబుతున్నప్పటికీ, ముఖ్యమంత్రికి నేరుగా సవాల్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తల్లికి అండగా నిలుస్తానని ఆమె చెప్పడం కుటుంబ రాజకీయాల్లో ఐక్యతను చూపించింది. మరోవైపు సురేఖ తన కుమార్తె వ్యాఖ్యల నుంచి తనను వేరు చేసుకోవడం గమనార్హం. ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వం ఈ వివాదాన్ని ఎలా నియంత్రిస్తుంది, సంబంధిత నేతలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది, పరకాల రాజకీయాల్లో ఎలాంటి మార్పులు వస్తాయి అన్నదే కీలకంగా మారింది. సురేఖ రాజకీయ భవిష్యత్, సుస్మిత సవాల్ ప్రభావం, స్థానిక కాంగ్రెస్ బలం, రేవంత్ స్పందనపై ఆసక్తి పెరిగింది. రాబోయే రోజుల్లో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు ఈ వివాదానికి ముగింపు ఇస్తాయా, లేక మరింత దుమారం రేపుతాయా అన్నది చూడాలి. తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం కొనసాగుతున్న చర్చగానే కనిపిస్తోంది.

# దమ్ముంటే కౌడిపల్లికి రా..!

**మొదటిపేజీ తరువాయి**

సీఎం కౌడిపల్లికి రావాలని డిమాండ్ చేశారు. అందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని ప్రకటించారు. రుణమాఫీ కాలేదని తేలితే సీఎం పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పది గంటల విద్యుత్ కూడా సరిగ్గా దొరకడం లేదు. డీఏపీ యూరియా ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇరవై నాలుగు గంటల నాణ్యమైన కరెంట్ లభించేది. ఉమ్మడి మెదక్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసింది. కాళేశ్వరం మోటార్ల మీద నిరాధారమైన డ్రామాలు ఆడుతున్నారు. రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ కొండపోచమ్మ ప్రాజెక్టులను డెడ్ స్టోరేజీకి చేర్చారు. బసవేశ్వర సంగమేశ్వర ఎత్తిపోతల కాలువల పనులను పూర్తిగా ఆపేశారు. అభివృద్ధి పనులన్నింటినీ మధ్యలోనే నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉద్యోగాలు అడిగే నిరుద్యోగులను ప్రభుత్వ పెద్దలు చిన్నచూపు చూస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అని తీవ్రంగా దూషిస్తున్నారు. అసలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పెద్ద క్రిమినల్ వేస్ట్ అని ఎద్దేవా చేశారు. కౌడిపల్లి మహమ్మద్ నగర్ పీఏసీఎస్ సంఘాలలో భారీ అవినీతి జరిగింది. ధాన్యం కొనుగోలు చేయకుండానే కాంగ్రెస్ నేతలు కోటి రూపాయలు స్వాహా చేశారు. ఈ భారీ కుంభకోణంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విచారణ జరిపించాలి. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకో



వాలని డిమాండ్ చేశారు. కౌడిపల్లిలో రెండు వందల ఎకరాల భూములతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను ఇబ్బంది పెడుతున్నారు. రైతుల భూములను ఇరవై రెండవ ఏ నిషేధిత జాబితాలో చేర్చి తీవ్రంగా వేధిస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా అర్థమవుతున్నాయి. ప్రజా సమస్యలను గాలికొదిలేసి పాలకులు కాలయాపన చేస్తున్నారు. వెయ్యి రోజుల కాలంలో సీఎం రేవంత్ రెడ్డి డెబ్బై ఏడు సార్లు ఢిల్లీకి వెళ్లారు. కేవలం ఫ్లైట్ టికెట్ల ఖర్చు తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. ఢిల్లీ పెద్దల చుట్టూ తిరగడం మినహా ప్రజా సంక్షేమం పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయం. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజల తరఫున నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులు మహిళలు నిరుద్యోగుల గొంతుకై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. పోలీసుల మోహరింపుతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని గుర్తుచేశారు. సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలందరూ గమనిస్తున్నారు. సరైన సమయంలో తగిన తీర్పునిస్తారని హెచ్చరించారు. సభలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సభలో ప్రముఖంగా ప్రస్తావించారు. రైతుల కష్టాలను పట్టించుకోని పాలకులకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని భరోసానిచ్చింది. ప్రభుత్వ మోసపూరిత వైఖరిని గ్రామస్థాయిలో ఎండగడతామని చెప్పారు. నేతల హెచ్చరికలతో అధికార పార్టీలో కలవరం మొదలైంది. రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రతి అంశానికి అధికార పక్షం సమాధానం చెప్పాలి. లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నాము. ప్రతి గ్రామంలోనూ సభలు నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వివరిస్తాము. యువకులు మహిళలు పెద్దఎత్తున ఈ ఆందోళనలో భాగస్వాములు కావాలి. పాలకవర్గం అవినీతిని అడ్డుకోవడానికి ప్రతి కార్యకర్త సైనికులా పనిచేయాలి. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న నాయకుల భరతం పడతాము. ఎలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పోలీసుల అణచివేత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే మా పార్టీ ప్రధాన లక్ష్యం. ప్రజల ఆశీస్సులతో త్వరలోనే రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుంది. రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తాము. నాయకులంతా సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలి. ప్రభుత్వ మోసపూరిత హామీలను ఇంటింటికీ వెళ్లి ఎలుగెత్తి చాటాలి. మహిళా సంఘాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వాన్ని నిలదీయాలి. యువతకు ఉద్యోగాలు రాకపోవడానికి కారణమైన ముఖ్యమంత్రి తీరును తీవ్రంగా ఖండించాలి. ప్రతి రంగంలోనూ విఫలమైన ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించబోము. కౌడిపల్లి గడ్డపై ప్రారంభమైన ఈ పోరాట స్ఫూర్తి రాష్ట్రమంతా వ్యాపించాలి. కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేందుకు అగ్రనేతలు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. ప్రజల పక్షాన పోరాడుతున్న మాపై ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయము. అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయి.

## హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బిఆర్ఎస్ శ్రేణులు

**సికింద్రాబాద్, విశాల భారతి :** మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురం పలు ప్రాంతాల్లో ఆంజనేయులు గౌడ్ అధ్వర్యంలో ఇంటి ఇంటికి తిరుగుతూ జాబ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఈ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంది నారాయణ కంది శైలజ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్, శైలేందర్ రమేష్, ప్రసాద్, జక్కా హరిబాబు, చింతకింది మల్లేష్, రాజేష్ మస్తాన్ బాబా, పాక సాయి, శీలం సాయి, కొండ కిషోర్, ఉండింటి సచిన్, వినోద్, గంగపుత్ర సాయి, బీబీ చారి, యాద క్రాంతి, సుమలత సుజాత, అనసూయ గౌడ్, మానస, రేణుక, మంజుల, లత, సులోచన, సుమతి, నందిత, భవిత, సుమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# హామీల హంగామా.. అమలులో శూన్యం!

- ఎన్నికల ముందు వాగ్దానాల వరద
- అధికారంలోకి వచ్చాక ప్రజలకు మొండి చేయి
- వెయ్యి రోజులు గడిచినా.. ఎన్నికల హామీల అమలుపై మౌనమే ఎందుకు?
- 420 హామీలు.. ఒక్కొక్కటిగా ప్రజల ముందు కాంగ్రెస్ బాకీ చిట్టా!
- 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి
- ప్రజా సమస్యలను గాలికొదిలేసి.. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శలు
- 420 హామీలతో మోసం.. 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ దగా!
- 1000 రోజుల పాలన.. హామీల అమలులో ఘోర వైఫల్యం
- రైతు భరోసా నుంచి నిరుద్యోగ భృతి వరకు.. మాట తప్పిన సర్కార్
- మహిళలు, రైతులు, యువతను మభ్యపెట్టిన కాంగ్రెస్‌కు ప్రజలే తీర్పు
- ఎన్నికల హామీలపై ప్రజా కోర్టులో కాంగ్రెస్‌ను నిలదీస్తాం..
- 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను గద్దెదించాలి
- బీఆర్ఎస్ సమరభేరి దీక్షలో మాజీ మంత్రులు రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్



**కురవి విశాల భారతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం 33 నెలలు.. 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'సమరభేరి దీక్ష' చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, మహిళలు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్‌తో పాటు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువలను పరిశీలించిన నాయకులు.. కాంగ్రెస్ పాలనలో కాలువల ద్వారా రైతుల పంటలకు సక్రమంగా సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం ర్యాలీగా సమరభేరి దీక్షా స్థలానికి చేరుకున్నారు.

**'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ**

దీక్షలో భాగంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలను గుర్తు చేస్తూ 'కాంగ్రెస్ బాకీ కార్డులను' ప్రజలకు పంపిణీ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4,000 పెన్షన్, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు వంటి హామీలు అమలు కాలేదని వారు విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, రైతు ఉపాధి హామీ పథకం కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల సాయం, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల సాయం తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

**'ప్రజా కోర్టులో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'.**

ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై దృష్టి పెట్టకుండా బూతుల పురాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రభుత్వ పాలకులు ప్రజా సంక్షేమం కంటే సంపాదన, కమీషన్లపైనే దృష్టి పెట్టారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకులు బజ్జూరు పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్, నూతక్కి నర్సింహారావు, నూతక్కి సాంబశివరావు, ముళ్ల రమేష్, ఐలి నరహరి, గుగులోత్ నెహ్రూనాయక్, బోడ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గణేష్ ఉత్సవ సమితి నాయకులతో సమావేశం నిర్వహించిన సీఎంసీ కమిషనర్ జి. శ్రీజన, ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్ ప్రీత్ సింగ్

# గణేశ్ ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- 54 నిమజ్జన కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు
- ట్రాఫిక్, పారిశుద్ధ్యం, భద్రతపై అధికారుల సమీక్ష

**సైబరాబాద్, విశాల భారతి**

గణేశ్ ఉత్సవాలు-2026ను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సైబరాబాద్ పరిధిలో అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా. జి. సృజన,ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సైబరాబాద్ పరిధిలోని 54 నిమజ్జన కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంపై ప్రధానంగా చర్చించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, బారికేడింగ్, రహదారులపై గుంతల పూడ్చివేత, భద్రతా చర్యలు, అత్యవసర సేవల సన్నద్ధత, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు వంటి అంశాలను సమీక్షించారు.గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, జన సందోహాన్ని సమర్థంగా నియంత్రించేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. వివిధ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్ణయించిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీర్లు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు

- కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు
- మహిళా ప్రజాప్రతినిధిపై అనుచిత పోస్టులు
- శాఖ క్రమశిక్షణ ఉల్లంఘనపై సీపీ రమేష్ చర్యలు

**సైబరాబాద్ - విశాల భారతి**



ఆర్ ఐ కానిస్టేబుల్ కే అనిల్ (ఫైల్)

సోషల్ మీడియాలో మహిళా ప్రజాప్రతినిధిని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌పై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ చర్యలు తీసుకుంది. హైదరాబాద్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె. అనిల్‌ను సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ సస్పెండ్ చేశారు. 2018 బ్యాచ్‌కు చెందిన అనిల్ ప్రస్తుతం హైదరాబాద్ సీఏఆర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోషల్ మీడియాలో మహిళా ప్రజాప్రతినిధిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో విచారణ చేపట్టారు. సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

**సోషల్ మీడియా వినియోగంపైనా హెచ్చరిక**

పోలీసు సిబ్బంది విధుల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ క్రమశిక్షణ, వృత్తి మర్యాద పాటించాలని సీపీ రమేష్ స్పష్టం చేశారు. శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. యూనిఫాంలో ఉన్న పోలీసు చేసే ప్రతి చర్యకు బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఈ వ్యవహారంపై తెలంగాణ రక్షణ సేన నాయకులు అదనపు డీజీపీ మహేష్ భగవత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌ను సర్వీసు నుంచి తొలగించడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అనిల్‌పై శాఖాపరమైన సస్పెన్షన్ అమల్లో ఉండగా, తదుపరి చర్యలు విచారణ ఆధారంగా ఉండనున్నాయి.

# గంజాయి డాన్ నీతు భాయి పై ఈడీ గురి

- ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- డ్రగ్స్ దందా డబ్బు మళ్లింపు, అక్రమ ఆస్తులపై ఆరా

**సైబరాబాద్ - విశాల భారతి**



నగరంలో గంజాయి దందాకు సంబంధించి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతు బాయి చుట్టూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉచ్చు బిగిస్తోంది. గంజాయి విక్రయాల ద్వారా సమకూరిన అక్రమ ఆదాయం, ఆ సొమ్మును వివిధ మార్గాల్లో మళ్లించి కూడబెట్టిన ఆస్తులపై దృష్టి సారించిన ఈడీ అధికారులు గురువారం తెల్లవారుజాము నుంచే హైదరాబాద్‌లోని ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు.తెలంగాణ ఎక్సైజ్, డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు నమోదు చేసిన మాదకద్రవ్యాల కేసుల ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. గంజాయి అక్రమ విక్రయాల ద్వారా వచ్చిన నగదును హవాలా మార్గాల్లో తరలించడం, బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టడం వంటి అంశాలపై అధికారులు ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. నానక్‌రాంగూడ, గచ్చిబౌలి వంటి ఐటీ కారిడార్ ప్రాంతాల్లో గంజాయి సరఫరా నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు నీతు భాయ్‌పై ఆరోపణలు ఉన్నాయి. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయిని నగరానికి తరలించి చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయించే వ్యవహారంలో ఆమె అనుచరులు, ఏజెంట్లు కీలకంగా వ్యవహరించినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. గతంలో ఆమెపై పలు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదైనట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న సోదాల్లో ఇళ్లు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి దందా ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడికి మళ్లింది? ఎవరెవరి పేర్లపై ఆస్తులు ఉన్నాయి? ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో ఈడీ విచారణ సాగుతోంది. సోదాలు, దర్యాప్తు పూర్తయ్యే కొద్దీ మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# బ్రెయిన్ స్ట్రోక్‌తో వ్యక్తి మృతి

- బాధిత కుటుంబానికి బలరాం యాదవ్ అండ
- రూ.15 వేల ఆర్థిక సాయం అందజేత

**కొండాపూర్ - విశాల భారతి**

శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన కాశీం వల్లి బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ మానవతా హృదయాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పి నగదును అందజేశారు.ఆపదలో ఉన్న కుటుంబానికి సాయం చేయడం తన బాధ్యత అని, భవిష్యత్తులో కూడా అండగా ఉంటానని బలరాం యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి



- మండపాల నిర్వహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రత ప్రమాణాలు పాటించాలి
- అధికార శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలి
- ప్రత్యేకంగా పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేయాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలి, వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతి ఉత్సవ కేంద్రాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కనెక్షన్లు తదితర అంశాలను విద్యుత్ శాఖ నిపుణుల సహకారంతో తనిఖీ చేయాలని సూచించారు. ఉత్సవ మండపాలు, విగ్రహాల ఏర్పాటు ప్రదేశాలను సురక్షితంగా ఎంపిక చేసి, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని, మండపాల నిర్మాణం పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని, నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

# కిండర్ క్లేలో కృష్ణాష్టమి సందడి





**కృష్ణుడి వేషధారణలో చిన్నారుల కనువిందు.. ఉత్సాహంగా వేడుకలు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

ఎల్‌బీనగర్ నియోజకవర్గం కొత్తపేట డివిజన్‌లోని కిండర్ క్లే పాఠశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మోర రాజిత ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల వేషధారణ, ఆటపాటలు, సందడి పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. ఉపాధ్యాయులు కృష్ణాష్టమి విశిష్టతను, శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను చిన్నారులకు వివరించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పండుగల ప్రాధాన్యతను తెలియజేసేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో చిన్నారుల ఉత్సాహాన్ని చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.



# ప్రజల భద్రతకే పోలీస్ శాఖ మొదటి ప్రాధాన్యం

- శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్
- ఐడీఏ బొల్లారంలో 103 సీసీ కెమెరాలు ప్రారంభం

**సైబరాబాద్ - విశాల భారతి**



ప్రజల రక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన 103 సీసీ కెమెరాలను డీసీపీ శ్రీనివాస్ గురువారం అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాల నివారణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. సీసీ కెమెరాలు సమాజ భద్రతకు మూడో కన్నులా ఉపయోగపడతాయన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన లేదా నేరం జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించడానికి, వారి కదలికలను ట్రాక్ చేసి కచ్చితమైన ఆధారాలు సేకరించడానికి ఈ నిఘా నేత్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు మరియు స్థానిక ప్రజలు కూడా తమ పరిసరాల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సామాజిక బాధ్యతతో ఆర్థిక సాయం అందించిన పలువురు దాతలు, పారిశ్రామికవేత్తలను డీసీపీ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందన పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బొల్లారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ హెచ్ ఓ) సుధీర్, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపార వేత్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీసీపీ కార్యాలయం పక్కనే గంజాయి మత్తు

- జీడిమెట్లలో ముగ్గురు యువకుల అరెస్ట్
- డ్రగ్ కిట్‌లో కెనబిస్ పాజిటివ్

**సైబరాబాద్ - విశాల భారతి:**

పోలీసుల నిఘా ఉన్న ప్రాంతంలోనే గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపూర్‌నగర్‌లో డీసీపీ కార్యాలయం సమీపంలోని పైప్‌లైన్ రోడ్డు పార్కింగ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం అందిన పక్కా సమాచారంతో జీడిమెట్ల పోలీసులు అక్కడ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని రాంకొల్లి సంగమేష్ (25), అవిజె నితిన్ (29), దాసర్తి గణేష్‌కుమార్ (24)గా గుర్తించారు.వారి వద్ద గంజాయి సేవించిన ఆనవాళ్లు గుర్తించిన పోలీసులు డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో యూరిన్ శాంపిల్స్ పరీక్షించారు. పరీక్షల్లో ముగ్గురికీ కెనబిస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారిని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.



# పదవి పెద్దది.. ప్రాధాన్యత శూన్యం!

- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శికి పార్టీలో చిన్నచూపు?
- నాయకత్వంలో సమన్వయ లోపంపై కార్యకర్తల్లో చర్చ
- ప్రోటోకాల్ పాటించడం లేదంటూ విమర్శలు
- మండల ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టి.. కార్యక్రమాల్లో మాత్రం పక్కన పెడుతున్నారా?
- పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నేతకు గుర్తింపు కరువు.. కార్యకర్తల్లో అంతర్గత చర్చ
- నాయకత్వం మధ్య సమన్వయంపై సందేహాలు
- కీలక పదవికి తగ్గ గౌరవం ఎక్కడంటున్న శ్రేణులు



**కురవి విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన సీనియర్ వార్డు సభ్యుడు నూతక్కి సాంబశివరావుకు బీఆర్ఎస్ పార్టీలో కీలక పదవి దక్కినా, ఆ స్థాయికి తగిన ప్రాధాన్యత లభించడం లేదనే చర్చ పార్టీలో సాగుతోంది. ప్రజలకు, పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి గతంలో నిర్వహించిన పార్టీ మండల, గ్రామ కమిటీల ఎన్నికల్లో తోట లాలయ్యను మండల అధ్యక్షుడిగా, నూతక్కి సాంబశివరావును మండల ప్రధాన కార్యదర్శిగా అధికారికంగా ఎన్నుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మండల ప్రధాన కార్యదర్శి పదవి పార్టీ వ్యవస్థలో కీలకమైనదిగా ఉన్నప్పటికీ, పలు పార్టీ కార్యక్రమాల్లో నూతక్కి సాంబశివరావుకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అభిప్రాయాలు కొందరు కార్యకర్తల నుంచి వ్యక్తమవుతున్నాయి. పదవి పెద్దదే.. కానీ పార్టీలో గుర్తింపు, ప్రాధాన్యత మాత్రం కనిపించడం లేదని పలువురు కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో పాటు మండల ప్రధాన కార్యదర్శికి కూడా తగిన ప్రాధాన్యత, సమన్వయ బాధ్యతలు ఉండాల్సి ఉంటుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.

**పార్టీలో సమన్వయం కొరవడిందా?**

మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి తదితర నాయకుల మధ్య సమన్వయం కీలకమని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కీలక పదవిలో ఉన్న నాయకుడికి కార్యక్రమాల నిర్వహణలో తగిన భాగస్వామ్యం, సమాచారం, బాధ్యతలు కల్పించకపోతే పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని వారు విశ్లేషిస్తున్నారు. "తోటి నాయకులకు ఉన్న విలువ మండల ప్రధాన కార్యదర్శికి లేదా?" అనే ప్రశ్నలు పార్టీ కార్యకర్తల్లో వినిపిస్తున్నాయి. పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకుడికి పదవి ఇచ్చిన తర్వాత ఆ పదవికి తగిన గౌరవం, బాధ్యత, ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు అంటున్నారు.

**పదవి ఇచ్చిన పార్టీ.. బాధ్యతలు ఎందుకు?**

నూతక్కి సాంబశివరావును మండల ప్రధాన కార్యదర్శిగా నియమించిన పార్టీ నాయకత్వం, ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే అవకాశం కల్పిస్తున్నదా? అనే చర్చ కూడా జరుగుతోంది. పదవి కేవలం పేరుకే పరిమితమైతే దాని వల్ల పార్టీకి, నాయకుడికి ప్రయోజనం ఏమిటనే ప్రశ్నలు కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నాయి. మండల స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచి, ప్రతి నాయకుడికి తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ఈ అంశంపై బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకత్వం స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## మల్లారంలో కొత్త మంచినీటి మోటారు ఏర్పాటు



**పినపాక, విశాల భారతి :** మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని కిందగుంపులో మంచినీటి మోటారు తరచూ కాలిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు మోటారు కాలిపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇర్ప సాంబశివరావు చొరవ తీసుకున్నారు. గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్త కంపెనీకి చెందిన మంచినీటి మోటారును తెప్పించి ఏర్పాటు చేయించారు. మోటారు ఏర్పాటు అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ వెంటనే స్పందించి కొత్త మోటారు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారం గ్రామపంచాయతీ కార్యదర్శి తరుణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జల సంరక్షణే భవిష్యత్తుకు భరోసా



**పినపాకలో జల మహోత్సవం**

**పినపాక, విశాల భారతి:** జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో పినపాక మండలం జగ్గారం గ్రామపంచాయతీ లో జల మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ సుహాసిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు తాగునీటి ప్రాధాన్యత, నీటి సంరక్షణ, నీటి వృథాను అరికట్టడం, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని ఏఈ ప్రవీణ్ సూచించారు. గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో జలజీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి వనరుల పరిరక్షణలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించి, నీటిని వృథా చేయకుండా వినియోగించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, జలజీవన్ మిషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కృష్ణయ్యల సందడి.. గోపికల కోలాహలం

**ఇచ్చోడలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు.. ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు**



**ఆదిలాబాద్ జిల్లా విశాల భారతి :** ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలు పాఠశాలల్లో వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేసి అందరినీ ఆకట్టుకున్నారు.బాలకృష్ణుడి రూపంలో చిన్నారులు చేసిన అల్లరి, గోపికల వేషధారణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

## ఈ నెల 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** నిజామాబాద్, సెప్టెంబర్ 3 : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5, 6, 12, 13 తేదీలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (స్పెషల్ క్యాంపెయిన్) నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మొదటి విడతగా 5, 6 తేదీలలో, రెండవ విడతగా 12, 13వ తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా ప్రతి బూత్ లెవల్ అధికారి (BLO) తమకు కేటాయించిన నిర్దేశిత ప్రదేశంలో అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటర్లకు అవసరమైన ఫారం6, ఫారం7, ఫారం8లతో పాటు ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం6 ద్వారా, ఓటరు జాబితాలోని పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం 7 ద్వారా, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు, చిరునామా మార్పు వంటి వాటికి ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారులతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా అందుబాటులో ఉండాలని, ముసాయిదా ఓటరు జాబితాను ఓటర్లు పరిశీలించేందుకు సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు లేదా కొత్తగా ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో తమ సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## స్టెల్లామేరి స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**



**బూర్గంపాడు /విశాల భారతి :** మొరంపల్లి బంజరలోని స్టెల్లామేరిస్ ఇంగ్లీష్ మీడియంస్కూల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు శ్రీకృష్ణుని జీవిత విశేషాలను వివరిస్తూ పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత మాట్లాడుతూ.. పండుగలు, సంప్రదాయాల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, ఆచారాలపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి జైలు శిక్ష

- మూడు కేసుల్లో ఆరు నెలల చొప్పున శిక్ష.. చెక్కుల మొత్తాన్ని చెల్లించాలని కోర్టు ఆదేశం
- పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తరుపున న్యాయవాది ముత్యాల కిశోర్ వాదనలు వినిపించారు




**బూర్గంపాడు /విశాలభారతి :** చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ (జే ఎఫ్ ఎం సీ ) కోర్టు శిక్ష విధించింది. వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన కాంట్రాక్టర్ కిలారు శ్రీనివాసరావు 2019లో లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వద్ద వివిధ దఫాల్లో మొత్తం రూ.22 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు.అనంతరం అప్పుగా తీసుకున్న మొత్తానికి సంబంధించి శ్రీనివాసరావు మూడు చెక్కులు ఇచ్చారు. వాటిని బ్యాంకులో జమ చేయగా నగదు లేకపోవడంతో చెక్కులు బౌన్స్ అయ్యాయి. దీంతో పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి భద్రాచలం (జే.ఫ్.ఎం.సీ) కోర్టును ఆశ్రయించి మూడు చెక్ బౌన్స్ కేసులు దాఖలు చేశారు.ఈ కేసుల్లో ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం గురువారం భద్రాచలం (జే.ఫ్.ఎం.సీ )కోర్టు న్యాయమూర్తి శివనాయక్ తుది తీర్పు వెలువరించారు. మూడు కేసుల్లో నిందితుడికి ఒక్కో కేసులో ఆరు నెలల చొప్పున జైలు శిక్ష విధించడంతో పాటు, సంబంధిత చెక్కుల మొత్తాన్ని చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు ఫిర్యాదుదారు తరపు న్యాయవాది తెలిపారు.ఫిర్యాదుదారు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తరఫున ప్రముఖ న్యాయవాది ముత్యాల కిషోర్ కోర్టులో వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ న్యాయం గెలిచిందని ఆనందం వ్యక్తం చేస్తూ చట్టం తనపని తాను చేసుకుపోతుందని చట్టం ఎవరికీ చుట్టం కాదని వ్యాఖ్యానించారు.

## వాటర్ పైప్ లీకేజీతో వృధాగా పోతున్న నీరు

- తీవ్ర ఇబ్బందుల్లో స్థానికులు
- రోడ్డు బురదమయం, వాహనదారులకు నరకం

**చౌటుప్పల్,విశాల భారతి:**

పట్టణంలోని 14 వార్డు శ్రీ కంఠంహేశ్వర కాలనీలో మంచినీటి పైప్ లైన్ లీకేజీ స్థానికులకు పెద్ద తలనొప్పిగా మారింది. గత వారం రోజులుగా ప్రధాన పైప్ లైన్ లీక్ అవుతూ వేల లీటర్ల తాగునీరు వృధాగా రోడ్లపైకి వస్తోంది. ఫోటోలో కనిపిస్తున్నట్టు రోడ్డు మొత్తం చెరువును తలపిస్తోంది.

**స్థానికుల ఆవేదన ఇదీ**

ఒకపక్క పట్టణంలో చాలా చోట్ల నీటి ఎద్దడి ఉంటే, ఇక్కడ ఇలా నీరు వృధా కావడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వచ్చే మంచినీటి సరఫరాలో ప్రెషర్ తక్కువగా ఉందని, లీకేజీ కారణంగానే తమ ఇళ్లకు సరిగా నీరు రావడం లేదని వాపోతున్నారు. "పిల్లలు స్కూల్ కి వెళ్లాలంటే ఈ బురద రోడ్డులోనే నడవాలి. బైకులు జారిపడుతున్నాయి. రాత్రి వేళ ఈ గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి" అని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

**అనారోగ్య భయం:**

రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. దుర్వాసన వస్తోంది. దీనివల్ల డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు భయపడుతున్నారు. చిన్నపాటి వర్షం వస్తేనే ఈ ప్రాంతం మొత్తం ముంపుకు గురవుతుందని అంటున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం:**

ఈ విషయంపై వాటర్ వర్క్స్, మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేసి వెళ్లిపోతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లీకేజీని యుద్ధ ప్రాతిపదికన అరికట్టి, దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గుండెంగలో కాంగ్రెస్ 1000 రోజుల పరిపాలన వైఫల్యం పై బిఆర్ఎస్ సమర బేరిలో..



**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్**

**(విశాల భారతి): ఆగస్టు 3**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామాల్లో ఏర్పాటు చేసినటువంటి కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి లోని రైతు సదస్సుకార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ శంకర్ నాయక్

**ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ....**

కాంగ్రెస్ 1000 రోజుల పాలనను వ్యతిరేకిస్తూ గూడూరు మండలం గుండెంగా గ్రామంలోని వాగ్య తండా SRSP కెనాల్ కాలువలోకి పార్టీ కార్యకర్తలతో రైతులతో కలిసి దిగి నిరసన... కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాలువలన్నీ సస్యశ్యామలంగా పారేదని రైతులు సుభిక్షంగా ఉండేవారని కొని ఆడారు. ఎండిపోయిన కాలువల్లోకి వెంటనే కాళేశ్వర జలాలు విడుదల చెసి ఎండి పోతున్న పంటలకు వెంటనే నీరు అందివ్వాలి . రైతులు మొత్తము అరిగోస పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వము సోయిలేకుండ మొద్దు నిద్రలో ఉన్నారు. రైతు బీమా పెండింగ్‌లు వెంటనే క్లియర్ చేయాలి. యూరియా బుకింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి! గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు, విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎండీ ఖాసీం మాజీ వైస్ ఎంపీపీ అరె వీరన్న ,మాజీ జనరల్ సెక్రటరీ నూకల సురేందర్ ,గుండెంగా సర్పంచ్ బోడ కిషన్ నాయక్ , రమేష్ ,నరసింహ నాయక్ జిల్ల యాకన్న, కొల్లాపురం మాజీ సర్పంచ్ సుధాకర్ , వివిధ గ్రామాల సర్పంచ్లు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## 1000 రోజుల కాంగ్రెస్ పాలన

**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రోజు 1000 రోజుల కాంగ్రెస్ పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. విద్యార్థులు మాట్లాడుతూ తమకు గతంలో బస్ పాసు వల్ల కొన్ని ఇబ్బందులు ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమకి కొంత ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని అన్నారు. మార చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేతృత్వంలో విద్యా, వైద్యం, వ్యవసాయంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అనంతరం వారు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ, ఉచిత విద్యుత్తు 200 యూనిట్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అన్నారు. అదేవిధంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ఇప్పుడు వారికి స్మార్ట్ రేషన్ కార్డులు కూడా ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వ్యాపారవేత్తల మీద దృష్టి సారించకుండా పేద, మధ్య తరగతి ప్రజలపై, ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేయాలని హితవు పలికారు. అనంతరం అంకాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన ఉప్పరి దుర్గయ్యను, మార చంద్రమోహన్ రెడ్డి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుకారాం, ఏఎంసి డైరెక్టర్ అమృత్ రావ్, మాజీ ఎంపీటీసీ ఎంసీ గంగారెడ్డి, వార్డు సభ్యులు ముఖీం, కల్లం రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేష్, గోపాల్, భూమేష్, స్వరూప్ రెడ్డి, కార్యకర్తలు, ముదిరాజ్ సంఘ సభ్యులు, గౌడ సంఘం సభ్యులు, మైనార్టీ సోదరులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం.. గర్భిణీ యువతి బలవన్మరణం

- మౌనిక మృతదేహానికి కాంగ్రెస్ నాయకుల నివాళి
- శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసిన సీరోల్ పోలీసులు



**కురవి, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో మోసపోయి, తీవ్ర మనస్తాపానికి గురైన బండి మౌనిక అనే యువతి బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మౌనిక మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మౌనిక గర్భిణిగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.. నల్లెల గ్రామానికి చెందిన మౌనిక, శ్రీకాంత్‌లు గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భం దాల్చిన అనంతరం శ్రీకాంత్ పెళ్లికి నిరాకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యపై ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మౌనిక బలవన్మరణానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో ప్రస్తావించిన ఇతరుల పాత్రపైనా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సీరోల్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కూతురిని కోల్పోయిన తల్లి దండ్రుల రోదనలు, బంధువుల కన్నీటి పర్యంతమైన పరిస్థితులతో నల్లెల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాలుగేళ్ల ప్రేమ బంధం విషాదాంతం కావడం గ్రామస్థులను కలచివేసింది.

**మౌనికకు కాంగ్రెస్ నాయకుల నివాళి**

మౌనిక మృతి విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి, సీనియర్ నాయకులు అంబటి వీరభద్రం గౌడ్, కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగని శ్రీనివాస్ గౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్, డోర్నకల్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొర్ని అనిల్, నల్లెల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి మల్లయ్య, నల్లెల బీఎల్ఏ బండి ఉప్పలయ్య, సీనియర్ నాయకుడు బండి రమేష్ తదితరులు మౌనిక భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## అరవింద హైస్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**గూడూరు,సెప్టెంబర్ 3(విశాల భారతి):** గూడూరు మండల కేంద్రంలోని అరవింద హైస్కూల్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు,రాధాదేవి వేషధారణ అలంకరణలతో అలరించారు.చిన్నారుల నృత్యాలు, భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రదర్శించారు. అరవింద ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. పిల్లలు వేషధారణలో బుడిబుడి అడుగులు వేస్తూ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టారు.పాఠశాల ప్రిన్సిపాల్ పింగిలి శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పింగిలి శ్రీనివాస్, ఉపాధ్యాయులు స్వరూప,మాధవి,కల్పన, సుమలత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఆదివారం ఊర బోనాలు

- శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయ కమిటీ



**చౌటుప్పల్,విశాల భారతి:** పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో ఈ ఆదివారం అనగా తేదీ 06.09.2026 నాడు బోనాల కార్యక్రమం (ఊర బోనాలు) ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనం సమర్పణ, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కావున భక్తులు ఈ విషయాన్ని గమనించగలరని శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయ కమిటీ, చౌటుప్పల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు ప్రమాదం గుర్తు తెలియని వ్యక్తి మృతి

**చౌటుప్పల్,విశాల భారతి:** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తూప్రాన్ పేట్ ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తేదీ 31082026 రాత్రి సుమారు 11 గంటల సమయంలో తూప్రాన్ పేట్ లోని లక్ష్మీ దుర్గ హోటల్ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతను చికిత్స పొందుతూ 02092026 రోజున మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మృతుడి గుర్తులు:** వయస్సు: సుమారు 45 నుండి 55 సంవత్సరాలు,ఎత్తు: సుమారు 5.7 అడుగులు,ఆనవాళ్లు: తెలుపు గడ్డం, తెలుపునలుపు రంగు జుట్టు,దుస్తులు: బూడిద రంగు చొక్కా, నీలం రంగు లుంగీ,ప్రమాద స్థలంలో అతని వద్ద ఎరుపు రంగు బెడ్ షీట్ ఉన్నట్లు గుర్తించారు.

# ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో జాప్యం సహించం
- నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్



**మహబూబాబాద్, జిల్లా విశాల భారతి):**

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యతను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారం, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన నష్టపరిహారం, పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల జనాభా 51 శాతం ఉన్నందున జనాభా ప్రాతిపదికన వారికి అందాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, అంగన్వాడీ నియామకాలు తదితర అంశాల్లో రోస్టర్ పాయింట్లను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూ సమస్యలు, అంబేద్కర్ ఓవర్సీస్ స్టడీ పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కార్పొరేట్ ఇంటర్ విద్య తదితర పథకాలలో అర్హులైన వారికి ప్రయోజనాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలతో పాటు అన్ని వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించేందుకు పక్కా డైట్ మెనూను అమలు చేయాలని, హాస్టల్ సంక్షేమ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమాల్లో న్యాయ సేవల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిశీలించి, సమస్యలు ఉంటే కమిటీ దృష్టికి తీసుకువచ్చి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**వేగంగా కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి:ఎస్పీ**

జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్డీపీవో, డీఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి సంబంధిత న్యాయస్థానాల్లో సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. ప్రతి కేసులో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేకంగా సమీక్షించి, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ తిరుపతిరావు, కమిటీ సభ్యులు గుగులోతు కిషన్ నాయక్, పంజా కల్పన, గొల్లపల్లి రజనీకాంత్, పులుసం పుష్పలత, గుగులోత్ దేశీరామ్ నాయక్, పి. రాజేంద్రప్రసాద్, రజితతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు చిన్నకొండూరు విద్యార్థిని ఎంపిక

**అండర్-17 బాలికల విభాగంలో సత్తా చాటిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎం.ప్రణీత**



**చౌటుప్పల్,విశాల భారతి:** మండలం చిన్నకొండూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని ఎం. ప్రణీత రాష్ట్రస్థాయి అండర్ 17 బాలికల ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్ బాల్ గర్ల్స్ జూనియర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నల్లగొండ జిల్లా చర్లపల్లిలో నిర్వహించిన అండర్ 17 బాలికల ఫుట్ బాల్ ఎంపిక పోటీల్లో ప్రణీత అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నిజామాబాద్ లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రవికిరణ్, పీడీ వి. కవిత హర్షం వ్యక్తం చేశారు. మందోళ్లగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు ప్రణీతను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు, మందోళ్లగూడెం గ్రామపంచాయతీకి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రణీతకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## సౌమ్య విద్యామందిర్‌లో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**చిట్యాల,విశాల భారతి:** పుస్తక విద్యతో పాటు విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడం కూడా విద్యలో భాగమేనని సౌమ్య విద్యామందిర్ పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్ అన్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాలలో ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి చిత్రపటానికి, ఉట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టి కేరింతలు కొడుతూ సందడి చేశారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చిన్నారులకు పరిచయం చేయవచ్చన్నారు. శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతం, కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, బొడిగె రాణి, గండమల్ల చర్విత, రేగులగడ్డ ప్రశాంతి, సూరోజు హర్షిణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మల్లికార్జున పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**చౌటుప్పల్,విశాల భారతి:** మండల కేంద్రంలోని మల్లిఖార్జున ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ మారెపల్లి మల్లారెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు పాఠశాల డైరెక్టర్లు శ్రీమతి భరణి, స్వామి, ప్రధానోపాధ్యాయులు బత్తుల కన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మల్లారెడ్డి మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి గొప్పతనాన్ని, ఆయన బాల్య లీలలను విద్యార్థులకు వివరించారు. రామాయణం, మహాభారతం వంటి పురాణ ఇతిహాసాల గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను ఉపాధ్యాయులు వివరించారు. చదువుతో పాటు పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో విద్యార్థులు చొరవతో పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉట్లు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ కవితారాణి, ఉపాధ్యాయులు ఆనంద్ కుమార్, యాదయ్య, మాధవి, వినీత, మల్లవి, సౌజన్య, శైల, శ్రీలత, సంతోష్, ఉమామహేశ్వరి, మానస, రజిత, పూజ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు 11 రకాల గుర్తింపు కార్డులు అందజేయాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**మహబూబాబాద్, జిల్లా విశాల భారతి:** మహబూబాబాద్ పట్టణంలోని హనుమంతునిగడ్డ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్, పద్మశాలి భవన్‌తో పాటు వివిధ పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లకు నోటీసులు అందజేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు సంబంధిత బూత్ స్థాయి అధికారులకు 11 రకాల గుర్తింపు కార్డుల్లో తగిన ధ్రువపత్రాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా సమర్పించి, ఓటర్ల జాబితాలో తమ పేరు కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ చేపట్టిన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఇంకా నోటీసులు అందని లేదా నోటీసులు అందుకున్న ఓటర్లకు సంబంధించిన వివరాలను సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అవసరమైతే స్వయంగా లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేశ్వరి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉపేందర్, ఉప తహసీల్దార్లు నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణా వాహనం పట్టివేత 26 పశువులు స్వాధీనం



**చౌటుప్పల్,విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ యస్ హెచ్ఓ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ నరేష్ (హెచ్ సి 2314), హెచ్ జి 92 సిబ్బంది పిఎం 2 విధులు నిర్వహిస్తుండగా అక్రమ పశువుల రవాణా జరుగుతోందని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వెంటనే చౌటుప్పల్ పట్టణంలోని ధర్మోజీగూడెం క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న ఐచర్ డీసీఎం వాహనం (నంబర్ TS 08 UG 8181) ను ఆపి తనిఖీ చేయగా, అందులో 26 పశువులు (16 ఆవులు, 10 ఎద్దులు) కుక్కిరి బిక్కిరిగా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ ఎస్‌కే ఇస్మాయిల్ (34), తండ్రి చాంద్ పాషా, నివాసం ఈసిఐఎల్, దమ్మాయిగూడ, హైదరాబాద్ ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో పశువుల యజమాని అసంతా వెంకన్న బాబు (55), తండ్రి చందర్ రావు, కులం: కాపు, నివాసం అన్నాయపేట, రామచంద్రాపురం, కోనసీమ జిల్లా సూచనల మేరకు, జగ్గయ్యపేట సంతలో కొనుగోలు చేసిన పశువులను హైదరాబాద్ లోని బహదూర్ పురకు తరలిస్తున్నట్లు తెలిపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ తెలిపారు.

## పోచారం అండదండలతో అరాచకాలు చేస్తే ఖబర్దార్




**మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**

పోచారం శ్రీనివాసరెడ్డి అండదండలతో ఆయన అనుచరులు కొందరు అరాచకాలు చేస్తున్నారని ఖబర్దార్ అని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హెచ్చరించారు గురువారం వర్ని మండల కేంద్రంలో రైతు ధర్నా లో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ని కి చెందిన కొందరు పోచారం శ్రీనివాసరెడ్డి అనుచరులు అరాచకాలు చేస్తున్నారని వారందరి లెక్కలు రాస్తున్నానని భవిష్యత్తులో వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు పోలీసులు సైతం తమ విధులను నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నిక్కచ్చిగా పనిచేసే అధికారులకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు అధికారం ఏ ఒక్కరి సొంతం కాదని భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు హత్యా రాజకీయాలు చేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయన కొడుకులు పద్ధతి మార్చుకోకపోతే బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు బాన్సువారా నియోజకవర్గాన్ని అప్పుడు ఇప్పుడు అభివృద్ధి చేసింది తానేనని గుర్తు చేశారు నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిజాం సాగర్ ప్రధాన కాలువలను డిస్ట్రిబ్యూటర్లను 500 కోట్ల రూపాయలతో ఆధునికరించడం జరిగింది అని గుర్తు చేశారు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని నమ్మి కోట్లాది రూపాయల నిధులను ఇవ్వడం జరిగింది అని గుర్తు చేశారు లక్ష్మీ పుత్రుడు అని కెసిఆర్ పేర్కొంటే పోచారం శ్రీనివాస్ రెడ్డి దరిద్రం పుత్రుడుగా మారాడని ఎద్దేవా చేశారు తగిలేపల్లి టాక్లి హత్య కేసులలో తమకేమిటి సంబంధం అని ప్రశ్నించారు తండ్రి కొడుకుల వర్గాలు కొట్టుకొని చేస్తే తమను ఇరికించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు అభివృద్ధి కోసం పార్టీ మారానని పోచారం చెప్పడం సిగ్గుచేటు అని కాంట్రాక్టర్ల కోసం కమిషన్ల కోసం పార్టీ మారారు అని మండిపడ్డారు రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వం అని కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు అని సూచించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పరిశీలకులు తోట ఆగన్న నియోజకవర్గ నాయకులు జుబేర్ మోరల్ శ్రీనివాస్ అంజిరెడ్డి వివిధ మండలాల నాయకులు ఏ జాజ్ దాస్ శంకరప్ప నాగభూషణం కిషన్ తెల్ల రవికుమార్ సుదం నవీన్ గాండ్ల మధు ధర్మ తేజ మాధవరెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెంచ్‌ప్రెస్ విజేతలకు ఘన సన్మానం




**భద్రాచలం: విశాల భారతి;**

పాల్వంచలో ఆగస్టు 30న నిర్వహించిన జిల్లాస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులను రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భద్రాచలం పద్మావతి తల్లి పిల్లల హాస్పిటల్స్, యూబీ రోడ్లో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన డివి శంకర్రావు, మహంతి వెంకటకృష్ణాజీ, వాకచర్ల లక్ష్మీనారాయణ, యారం నాగపున్నారెడ్డి, శ్రీరామ్ నటరాజన్, చాణక్య, మామిడి భూమికలను రోటరీ రివర్‌సైడ్ ప్రతినిధులు సత్కరించి అభినందించారు. వీరికి శిక్షణ అందించిన కోచ్ జీవీ రామిరెడ్డిని కూడా ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం అధ్యక్షుడు రోటేరియన్ డా. మల్లంపాటి నరసింహారెడ్డి, ఎంబీబీఎస్ ఎండి (రేడియాలజీ) మాట్లాడుతూ, క్రీడల్లో విజయం సాధించడానికి శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని అన్నారు. బెంచ్‌ప్రెస్ వంటి క్రీడల్లో జిల్లా స్థాయిలో పతకాలు సాధించడం భద్రాచలం ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు.విజయం సాధించిన ప్రతి ఒక్కరి వెనుక ఎన్నో రోజుల కష్టం, క్రమశిక్షణ, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వం ఉంటాయి. ఈ క్రీడాకారులు సాధించిన విజయం ఇతర యువతకు కూడా స్ఫూర్తిగా నిలవాలి. క్రీడల వైపు యువత మరింతగా అడుగులు వేయాలి. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించేందుకు రోటరీ ఎప్పుడూ ముందుంటుంది" అని డా. నరసింహారెడ్డి అన్నారు. క్రీడాకారులు సాధించిన విజయాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు తమ పట్టుదలను కొనసాగించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అభిలషించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం కార్యదర్శి డా. ప్రశాంత్ పోతరాజు, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డా. సాయి కిషోర్ కంచేటి తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కోచ్ జీవీ రామిరెడ్డి మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమం తప్పకుండా చేసిన సాధన, కఠోర శ్రమకు ఈ పతకాలు నిదర్శనమని తెలిపారు. తమ క్రీడాకారులను రోటరీ రివర్‌సైడ్ ఆధ్వర్యంలో సన్మానించడం ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

## అనుమతులు లేకుండా అక్రమ బ్లాస్టింగ్

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

యాచారం పోలీస్ స్టేషన్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, యాచారం మండలం పరిధిలోని నజిక్ సింగారం గ్రామంలోని వాసవి వెంచర్, Sy.Nos. 144, 145, 153, 154 వద్ద ప్రభుత్వ అధికారుల నుండి అవసరమైన అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు పంచ సాక్షులు పెట్రోల్ మొబైల్ I సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని బ్లాస్టింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్న కోడదల నాగేందర్ (27), నల్గొండ జిల్లా శివరాత్రి రమేష్ (35), నల్గొండ జిల్లాలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 33 జెలటిన్ స్టిక్స్, 50 మీటర్ల DF వైర్, ఒక కంప్రెసర్ ట్రాక్టర్ రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు అవసరమైన ప్రభుత్వ అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు, భూమి యజమాని , హైదరాబాద్ సూచనల మేరకు పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలా ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా ఏవరైనా ఇలాంటి ప్రేలుడు పదార్థాలను కలిగి ఉన్న ప్రేలుడు పదార్థాలను ఉపయోగించి ఎలాంటి బ్లాస్టింగ్ పనులు చేసిన వారిపై చట్ట పరమైన చర్య తీసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## మోటపోతుల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**కురవి విశాల భారతి:** డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండల కేంద్రానికి చెందిన మోటపోతుల వీరన్న, ఆయన కుమారుడు మోటపోతుల రమేష్ ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వీరన్న, రమేష్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తండ్రి, కుమారుడు ఇద్దరూ మృతి చెందడం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల బీఆర్ఎస్ నాయకులు బోడ శ్రీను నాయక్, గూగులోత్ నెహ్రూ నాయక్, బాదే నాగన్న, కల్లెపు శ్రీను, సంగం భరత్, బోడ హనుమంతు, బోడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

**'కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** స్థానిక బైపాస్ రోడ్డులోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థుల సందడి, వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కే. చంద్రమౌళి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు భగవంతుడిగా మాత్రమే కాకుండా గొప్ప గురువుగా, స్నేహితుడిగా, మార్గదర్శిగా అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. ధర్మం, సత్యం, ప్రేమ, స్నేహం, కర్తవ్యబద్ధత వంటి విలువలను శ్రీకృష్ణుడి బోధనలు మనకు నేర్పుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఫలితం గురించి ఆలోచించకుండా తమ కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి మధు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలు పిల్లలకు ఎంతో ఇష్టమైనవని, అయితే వాటి వెనుక ఉన్న ప్రేమ, ధైర్యం, తెలివితేటలు, మంచితనం వంటి విలువలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. నిజం మాట్లాడటం, ఇతరులను ప్రేమించడం, కష్టాల్లో ధైర్యంగా ఉండటం, బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం శ్రీకృష్ణుడి నుంచి నేర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులలో ఆధ్యాత్మికతతో పాటు నైతిక విలువలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కే. చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయుడు దాసరి మధు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెగడపల్లిలో 15 సీసీ కెమెరాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్








**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** బోధన్ రూరల్ బోధన్: బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో "మన ఊరు మన భద్రతమన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను గురువారం పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో భద్రతను పెంపొందించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానమని, సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన శాలిమార్ హాచరీస్ సంస్థను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి వ్యాపారవేత్త, షాపు యజమానులు తమ భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన:**

సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం పట్ల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, 2025లో వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 340 మంది చనిపోగా, అందులో 200 మంది గ్రామ స్థాయిలో జరిగిన ప్రమాదాల వల్లే ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. ప్రయాణాల్లో ప్రతీ ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని మహిళలు, విద్యార్థినులతో మాట్లాడిన సీపీ, విద్యార్థులు ఎలాంటి ఆకర్షణలకు గురికాకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్ఐ రాజశేఖర్, గ్రామ సర్పంచ్ రచన సుదర్శన్, ఉపసర్పంచ్ షబ్బీర్, వైస్ ప్రెసిడెంట్ పోతు రెడ్డి, విలేజ్ కమిటీ ప్రెసిడెంట్ సాయిబాబు, శాలిమార్ హాచరీస్ మేనేజర్ ఇమ్రాన్ ముల్లా మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కూలేశ్వరం లాంటి దోచుకునే ప్రాజెక్టులు
# కాంగ్రెస్ పార్టీ కట్టలేదు:ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పుల విశాల భారతి**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలకేంద్రం లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి ప్రధాన చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించి టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమే ఈ 1000 రోజుల పాలన అని,ముందు రాబోయే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలలో గెలిచి బిఆర్ఎస్ పార్టీకి ఘాటుగా సమాధానం చెప్పాలని,దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ చేసిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని,ప్రజా ప్రభుత్వం వచ్చిన కానుండి మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా



క్షేత్రంలో అనునిత్యం ప్రజలకోసం పని చేస్తున్నామని,ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500కే గ్యాస్ సిలిండర్,ఇందిరమ్మ ఇళ్ల పథకం,రైతులకు రైతు భరోసా,పంట రుణమాఫీ,మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు,యువతకు ఉపాధి,విద్యా అవకాశాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలులో ఉన్నాయని,అసలైన నిరుపేదలకు ఇదిరమ్మ ఇండ్లు ఇచ్చామని,ప్రజలపై ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని,గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అనేక రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని, రైతాంగం,మహిళలు,దళితులు,గిరిజనులు,బీసీలు ,మైనార్టీలు,యువత అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, కాళేశ్వరం కులేశ్వరం లాంటి దోచుకునే ప్రాజెక్టుల మీద కాదు దృష్టిపెట్టింది రైతులకు లాభం చేకూరేలా పాలకుర్తి,చెన్నూరు రిజర్వాయర్ల నుండి 77వేల ఎకరాలకు సాగునీరును అందించేందుకు వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని,రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండుకృష్ణ,దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,ఎస్టీ,ఎస్సి,బిసి,మైనారిటీ అధ్యక్షులు భూక్యా సజ్జన్, ఇనుముల నాగరాజు, కాడబోయిన గణేష్, మహ్మద్ రసూల్,మండల యూత్ అధ్యక్షుడు పులుగిల్ల వెంకన్న,నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మండల ముఖ్య నాయకులు,ప్రజా ప్రతినిధులు,యువజన నాయకులు,ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు,మహిళా కాంగ్రెస్ నాసుకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నీళ్లు వచ్చాయని శాలువాలు కప్పించుకోవడం కాదు కాలువలకు నీళ్లు ఇచ్చి రైతుల కన్నీళ్లు తుడవాలి

**తీగల దయాకర్ గౌడ్**



**దేవరుప్పుల విశాల భారతి :** కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు వచ్చాయని ప్రచారం చేసుకోవడం, సన్మానాలు చేసుకోవడం కాదు కాలువలకు నీళ్లు విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని దేవరుప్పుల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరుప్పుల మండలం,పెద్దతండాలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను,నీరు లేక వెలవెలబోతున్న కాలువలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పరిశీలించారు. కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు రైతుల సమస్యలపై బి ఆర్ ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తీగల దయాకర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని,రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని,రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,మండల నాయకులు,ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా బబ్బులు శ్రీకాంత్ గౌడ్



**దేవరుప్పుల విశాల భారతి :** మండలం పెద్దమదూరు గ్రామానికి చెందిన గోకారపు బిక్షపతి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి రాములు, గ్రామ సర్పంచ్ గిరిబాబు, ఉపసర్పంచ్ చంద్రగిరి సంపత్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**కంటి దానంపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి.. డీ.ఎం.హెచ్.ఓ. తుకారామ్ రాథోడ్**




**పాల్వంచ విశాల భారతి:** పోషకాహార వారోత్సవం సందర్భంగా ప్రజల్లో సమతుల ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ సూచించారు. పాల్వంచ లోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శరీరానికి అవసరమైన పిండి పదార్థాలు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు, తగినంత నీటిని సమతుల మోతాదులో తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే 41వ జాతీయ కంటి దాన పక్షోత్సవం సందర్భంగా కంటి దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. కంటి దానం ద్వారా కార్నియా సంబంధిత అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపు కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్, ఐడీఎస్పీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బానోత్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పండురంగాపురంలో మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




**పాల్వంచ విశాల భారతి:** పండురంగాపురంలోని మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులచే వెన్న ముంతలు, భగవద్గీత శ్లోకాల పఠనం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజు మాట్లాడుతూ.. చిన్నారులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించడమే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చి. వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పాలిటెక్నిక్ సమస్యలపై ఉద్యమం

**దేశవ్యాప్త ఆందోళనకు మద్దతివ్వాలి.. ఎస్ఎఫ్ఐ వినతి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి అన్ని విశ్వవిద్యాలయాలు మద్దతు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి. శంకర్ కోరారు. ఈ మేరకు జేఎన్‌యూ ఎస్ఎఫ్ఐ అధ్యక్షురాలు, ఎస్ఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షురాలు ఐష్ ఘోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి. శంకర్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. శక్తి విధానాన్ని రద్దు చేయడంతో పాటు జీఓ నంబర్ 97ను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న ఉద్యమానికి అన్ని విశ్వవిద్యాలయాలు, విద్యార్థి సంఘాలు మద్దతుగా నిలవాలని శంకర్ కోరారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని అన్నారుఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, వంశీ, తరంగ్, విద్యార్థులు పునీత్, గౌస్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం యువకుడు మృతి

**ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై బొంగులూరు టోల్ ప్లాజా ఎగ్జిట్ నంబర్ 13 వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కూరగాయల లోడ్‌తో వెళ్తున్న మహీంద్రా బొలెరో వాహనం ముందు వెళ్తున్న టస్కర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని నంద్యాల జిల్లా డోన్ మండలం ఫీవర్ బండ గ్రామానికి చెందిన కొటకొండ శివ (22), తన మామ నాగేశ్వర్‌రావుతో కలిసి (ఏపీ39డబ్ల్యు జీ6841) నంబర్ గల బొలెరో వాహనంలో కూరగాయల లోడ్‌తో తుక్కుగూడ నుంచి బొంగులూరు వైపు వెళ్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

## నెక్నాంపూర్ గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



**రాజేంద్రనగర్, విశాల భారతి :** నెక్నాంపూర్ డివిజన్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, పలు పౌర సమస్యలపై సిఎంసీ కమిషనర్ శ్రీజన, జోనల్ కమిషనర్ అమిత్ బుధవారం పర్యటించి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను జితేందర్ మెరుగు కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లారు. నెక్నాంపూర్ నిమజ్జన ట్యాంకులోకి డ్రైనేజీ మురుగునీరు చేరుతున్న విషయాన్ని అధికారులకు వివరించారు. మురుగునీరు నిమజ్జన ట్యాంకులోకి ప్రవేశించకుండా సంబంధిత ఇన్‌లెట్‌ను వెంటనే మూసివేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి మురుగునీరు చెరువులోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. నెక్నాంపూర్ చెరువు పునరుద్ధరణ పనులను కూడా అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని జితేందర్ మెరుగు కోరారు. దీనిపై కమిషనర్ శ్రీజన సానుకూలంగా స్పందిస్తూ.. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పెండింగ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువుల పరిరక్షణతో పాటు సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరమని జితేందర్ మెరుగు పేర్కొన్నారు. నెక్నాంపూర్ చెరువు సమస్యల పరిష్కారం, పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ ప్రజల తరఫున పోరాడుతామని తెలిపారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో వరుస హత్యల కలకలం

- 12 గంటల్లోనే రెండు హత్యలు.. నడిరోడ్డుపై యువకుడి దారుణ హత్య
- కళ్లలో కారం కొట్టి కత్తులతో దాడి.. నిందితుల కోసం పోలీసుల గాలింపు



**రాజేంద్రనగర్: విశాల భారతి:** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస హత్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఓ హత్య ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే మరో యువకుడు దారుణ హత్యకు గురికావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. కేవలం 12 గంటల వ్యవధిలో రెండు హత్యలు చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. వరుస ఘటనలతో ప్రాంతంలో శాంతిభద్రతలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం అబ్దుల్ రవూఫ్ అనే యువకుడు వెళ్తుండగా కొందరు వ్యక్తులు అతడిని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడ్డారు. ముందుగానే పథకం ప్రకారం కాపుకాసిన దుండగులు రవూఫ్‌పై ఒక్కసారిగా దాడి చేసినట్లు తెలుస్తోంది. ముందుగా అతడి కళ్లలో కారం కొట్టి ప్రతిఘటించే అవకాశం లేకుండా చేసి, అనంతరం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన రవూఫ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. హత్య అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. హత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీస్తున్నారు. పాత కక్షలు, వ్యక్తిగత విభేదాలు లేదా గ్యాంగ్ వ్యవహారాలకు సంబంధించిన అంశాలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఒకే ప్రాంతంలో కొద్ది గంటల వ్యవధిలో రెండు హత్యలు జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రాంతంలో పోలీసు నిఘాను మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు. వరుస హత్యలకు కారణమైన నిందితులను త్వరగా పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కృష్ణవేణి స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**సికింద్రాబాద్,విశాల భారతి :** సికింద్రాబాద్ బోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం అందరినీ ఎంతగానో అలరించాయి. విద్యార్థుల ఆటపాటలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. చిన్నతనం నుంచే పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావనలు అలవడేలా పాఠశాలలో ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల వరలక్ష్మి, కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, విజయభాస్కర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు, కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేసింది.

## 22 ఏ ఆంక్షలు రద్దుచేసి రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టాలి




**ముషీరాబాద్,విశాల భారతి:** 22 ఏ రద్దుచేసి వెంటనే రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తూ రాంనగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ను నిరసిస్తూ 22ఏ వ్యతిరేకంగా బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ముఖ్య నాయకులు ముఠా జైసింహ మాట్లాడుతూ 22ఏ సమస్యతో ప్రజలు, భూయజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలును పక్కనపెట్టి ప్రజలను సమస్యలతో ఇబ్బంది పెడుతుందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు హామీలు, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు. అంతేకాకుండా 22ఏలో ఉన్న భూముల సమస్యను వెంటనే పరిష్కరించి, అర్హులైన భూయజమానులకు న్యాయం చేయాలని కోరారు.ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని హామీలు అమలు చేసే వరకు 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ప్రజల తరఫున మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు రోషం మల్లేష్, సోమన్, మాధవ్, శ్రీనివాస్ రెడ్డి, ముచ్చ కుర్తి ప్రభాకర్, నేత శ్రీనివాస్, మేకల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు హామీలపై బీఆర్ఎస్ సమరశంఖం

**విశాల భారతి, ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్‌మెట్**

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండల కేంద్రంలో రైతు సదస్సును బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి). హాజరైనారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతుభరోసా, రుణమాఫీ, వరి పంటకు బోనస్, రైతు కూలీలకు ఆర్థిక సాయం వంటి అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.



**రైతులకు అందాల్సిన ప్రయోజనాలు ఇవ్వాలి**

రైతుభరోసా, రుణమాఫీ, పంట బోనస్ వంటి పథకాల కింద రైతులకు అందాల్సిన ప్రయోజనాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు ఎకరాల రైతుకు రైతుభరోసా కింద రూ.1.02 లక్షలు, రుణమాఫీ కింద రూ.2 లక్షలు, వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్, ప్రతి ఎకరాకు రూ.12,500 చొప్పున ఆరు పంటలకు రూ.75 వేల వరకు అందాల్సి ఉందని పేర్కొన్నారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

***22-ఏ సమస్యను పరిష్కరించాలి**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న 22ఏ భూముల సమస్యను కూడా సదస్సులో ప్రస్తావించారు. 22ఏ జాబితా కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు, ఇతర లావాదేవీల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. భూముల సమస్యలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

**ఫార్మాసిటీపై హామీ నిలబెట్టుకోవాలి**

యాచారం ప్రాంతంలో ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన వైఖరిని మార్చుకుందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రైతుల భూములు, భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి), దండెం రాంరెడ్డితో పాటు రంగా రెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, యాచారం మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్,, మంచాల మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి పచ్చ భాష, సహకార బ్యాంక్ చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి, బూడిద రాం రెడ్డి, మాజీ ఎంపీపీ రజిత రాజు నాయక్,యువజన సంఘం నాయకులు ఖాజు భాయ్, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్లు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 22-ఏ చిక్కుల్లో భూముల లావాదేవీలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

22ఏ జాబితాలో భూములు ఉండటంతో రైతులు, ప్లాట్ యజమానులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించేందుకు మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. హయత్‌నగర్ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో 22ఏ కారణంగా భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో చర్చించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొని హయత్‌నగర్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. సొంత భూములపై హక్కులు ఉన్నప్పటికీ అవి 22ఏ జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు, ఇతర భూ లావాదేవీలు నిర్వహించడంలో యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

**హక్కులు ఉన్నా.. లావాదేవీలకు అడ్డంకులు**

ప్రైవేటు పట్టా భూములు, రైతుల వ్యవసాయ భూములు, ప్లాట్ యజమానుల ఆస్తులు 22ఏ పరిధిలో ఉండటం వల్ల భూ యజమానులు తమ ఆస్తులకు సంబంధించిన లావాదేవీలు చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్లు సమావేశంలో ప్రస్తావించారు. భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సమగ్ర పరిష్కారానికి చర్యలు**

22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్రంగా పరిశీలన జరిపి, అర్హత కలిగిన భూముల విషయంలో సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో చర్చించారు. ప్రజల ఆస్తి హక్కులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చట్టపరమైన, పరిపాలనా చర్యలు చేపట్టాలని సూచించారు. హయత్‌నగర్ ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, భూ యజమానుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారి భాస్కర్ గౌడ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సూర్యకు జోడీగా?

నటిగా వామికా గబ్బీది 19ఏండ్ల ప్రయాణం. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, పంజాబీ భాషల్లో కలిపి దాదాపుగా ఓ ముప్పై సినిమాల్లో నటించింది. కానీ గుర్తింపు మాత్రం అరాకొరే. అయితే.. 'డీసీ' సినిమా ఆమె తలరాతను మార్చింది. రాత్రికి రాత్రి తనను స్టార్‌ని చేసింది. ఆ సినిమాలో వామిక పోషించిన 'చంద్ర' పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో బలమైన ముద్రనే వేసిందని చెప్పాలి. దీంతో ఈ చండీఘడ్ సుందరికి అవకాశాలు వరుస కడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అగ్ర కథానాయకుడు సూర్యకు జోడీగా ఈ ముద్దుగుమ్మ నటించనున్నట్టు వినికిడి. సూర్య ప్రస్తుతం జితు మాధవన్ దర్శకత్వంలో 47వ సినిమా చేస్తున్నారు. 'జైభీమ్' దర్శకుడు జ్ఞానవేల్ దర్శకత్వంలో 48వ సినిమా ఉంటుంది. తర్వాత హెచ్.వినోద్ డైరెక్షన్‌లో 49వ సినిమా చేస్తారు సూర్య. ఆ సినిమాలోనే వామిక గబ్బీ కథానాయికగా ఖరారైనట్టు తెలిసింది. ఈ వార్త నిజమైతే.. వామికా రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.